## ఎంపాక్స్ చికిత్సకు మార్గదర్శకాలు

న్యూఢిల్లీ : ఎంపాక్స్ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించడానికి ఢిల్లీ ఎయిమ్స్ మార్గదర్శకాలు జారీ చేసింది. ఐసొలేషన్ వార్డులో చికిత్స కోసం ఐదు పడకలను కేటాయించింది. ఇతర రోగులు, సిబ్బందితో కాంటాక్ట్‌ను తగ్గించడానికి అనుమానిత రోగులను వెంటనే నిర్దేశిత ఐసొలేషన్ వార్డులో ఉంచాలని పేర్కొంది. ఈ వ్యాధిపై అవగాహన పెంచడం, వేగంగా గుర్తించడం, వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి కఠినమైన నియంత్రణ చర్యలు అవసరమని తెలిపింది. ఎయిమ్స్ జారీ చేసిన ఎస్‌వోపీ ప్రకారం.... మంకీపాక్స్ అనేది వైరల్ జునోసిస్ వ్యాధి. ఇది మశూచి రోగుల్లో కనిపించిన లక్షణాలను పోలి ఉంటుంది. అయితే దీని తీవ్రత తక్కువ. జ్వరం, దద్దుర్లు లేదా మంకీపాక్స్ నిర్ధారణ అయిన రోగులను కలిసిన చరిత్ర ఉన్నవారిని తక్షణం గుర్తించాలి. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వెన్నునొప్పి, చర్మంపై పొక్కులు, దద్దుర్లు తదితర లక్షణాలతో వచ్చేవారిని ఐసొలేట్ చేయడానికి ఏబీ-7 వార్డులో ఐదు పడకలు కేటాయించినట్లు తెలిపింది.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 210 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 ఆగష్టు 2024 గురువారం పేజీలు : 4

# 'రెస్పెక్ట్' కావాలి!

## గౌరవం కోసం పాకులాడుతున్న కెసిఆర్,జగన్..!!



## నాడే ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి రాదు కదా?

రాజకీయాల్లో గౌరవ సాంప్రదాయాలు కొనసాగాలి. అప్పుడే మన తరువాత తరం వాటిని కొనసాగిస్తుంది. రాజకీయాల్లో ఔన్నత్యం సాధ్యపడుతుంది. కానీ దురదృష్టవశాత్తు ఏపీలో ఆ పరిస్థితి లేదు. ప్రజాస్వామ్యానికి కట్టుబడి పాలన చేస్తూ.. ప్రతిపక్షాలతో పాటు మీడియాను గౌరవిస్తేనే ఆ సంప్రదాయం కొనసాగేది. ఒకవేళ అధికారపక్షం ప్రతిపక్షంలోకి వెళ్ళినా.. ప్రతిపక్షం అధికారంలోకి వచ్చినా.. ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ ఏపీలో ఈ పరిస్థితి ఉందా? అంటే మాత్రం సామాన్యుడు సైతం లేదనే చెబుతాడు. గతంలో రాజకీయాలలో కనిపించే కట్టుబాట్లు, నైతిక విలువలు ఇప్పుడు ఉండట్లేదు. అందుకే రాజకీయాల్లో ఉండే ప్రతి ఒక్కరు ఏదో సమయంలో బాధితులుగా మారని తప్పని పరిస్థితి. గత ఐదేళ్లలో జగన్ పాలననే ఉదాహరణగా తీసుకుందాం.టిడిపికి 23 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు.కానీ నాడు శాసనసభ పక్ష నేతగా, సీఎంగా జగన్ చేసిన వ్యాఖ్యలు ఒక్కసారి గుర్తు చేసుకుందాం. టిడిపి నుంచి ఓ ఐదారుగురు ఎమ్మెల్యేలను లాక్కుంటే చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా కూడా దక్కదని తేల్చి చెప్పారు. నాడు చేసిన కామెంట్స్ నేడు జగన్ కు ఇబ్బందిగా మారాయి. 11 మంది ఎమ్మెల్యేలతో ఉన్న జగన్ కు ప్రతిపక్ష హోదా దక్కలేదు. ఒకవేళ నాడు టిడిపిని, చంద్రబాబును గౌరవించి ఉంటే.. జగన్ కు అదే తరహాలో గౌరవం దక్కేది. కానీ జగన్ అలా ఆలోచించలేదు. చంద్రబాబును వెంటాడి వేటాడారు. శాసనసభ వేదికగా దారుణంగా అవమానించారు. అవమాన భారంతో శాసనసభ నుంచి బయటకు పోయేలా చేశారు. అందుకే నేడు జగన్ శాసనసభకు వచ్చేందుకు భయపడుతున్నారు.

**కెసిఆర్ ది అంతా ఏకపక్షమే :** తెలంగాణలో సైతం కేసీఆర్ అదే మాదిరిగా వ్యవహరించారు. ప్రతిపక్ష నేతలను గౌరవించలేదు. మీడియాను లెక్క చేయలేదు. చివరకు వామపక్ష నేతలకు సైతం అపాయింట్మెంట్ ఇవ్వలేదు. పోనీ తనకు తాను స్వయంపాలన అందించారా అంటే అది లేదు. అప్పటివరకు ఉద్యమ తెలంగాణ అన్నారు. తరువాత బంగారు తెలంగాణను తెరపైకి తెచ్చారు. పక్క పార్టీలకు చెందిన నేతలను చేర్చుకొని మంత్రి పదవులు ఇచ్చారు. విపక్ష నేతలను చాలా చులకనగా మాట్లాడారు. ఇప్పుడు అవే మాటలు తనకు ఎదురవుతాయని తెలిసి శాసనసభకు డుమ్మా కొడుతున్నారు.

**అదే ఆలోచనలో జగన్ :** కెసిఆర్ మాదిరిగానే జగన్ ఆలోచనలు నడిచాయి. 2014 నుంచి 2023 వరకు తెలంగాణకు పాలన అందించారు కేసీఆర్. తనకు తాను తెలంగాణ మహాత్ముడుగా భావించారు. 2018లో రెండోసారి విజయం దక్కేసరికి.. ఎక్కడలేని అహాన్ని తలకెక్కించుకున్నారు. ప్రజల్లో క్రమేపి సెంటిమెంట్ పడిపోయిందని గ్రహించలేకపోయారు. సెంటిమెంట్ తోనే తాను రాజకీయాలు చేశానన్న విషయాన్ని గుర్తు చేసుకోలేకపోయారు. కేవలం తన పద్ధతి ద్వారా, విపక్ష నేతలను చులకన చేయడం ద్వారానే అధికారానికి దూరమయ్యారు. తెలంగాణ సమాజం దూరమైంది. సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా దక్కలేదు.

**ప్రతిపక్షం అన్న బాధ :** జగన్ పరిస్థితి అదే. విపక్ష నేతలను చాలా చులకనగా చూశారు. వారు నా వెంట్రుక కూడా పీకలేరని ఎద్దేవా చేశారు. 30 సంవత్సరాల పాటు ఏపీని ఏలుతానని ప్రగల్బాలు పలికారు. వాస్తవ పరిస్థితిని మరిచిపోయారు. తన వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారని పసిగట్ట లేకపోయారు. సాధారణంగా ప్రతిపక్షం అంటేనే ప్రజల పక్షం. కానీ ఆ ప్రజల వాయిస్ ను వినిపించలేని స్థితిలోకి ఈ ఇద్దరు నేతలు చేరుకున్నారు. దానినే తమకు గౌరవం ఇవ్వడం లేదనే సంకేతాన్ని పంపుతున్నారు. అయితే ఈ విషయంలో ఆ ఇద్దరు నేతలు ఎవరిని శంకించాల్సిన అవసరం లేదు. అది ముమ్మాటికి వారి స్వయంకృత అపరాధమే.

# ఆ డబ్బులు అన్ని జిల్లాలకు అందించండి...



## భట్టికి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్: పోలీసులకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులు అన్ని జిల్లాల ఉద్యోగులకు విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. ఆ నిధులను కొన్ని జిల్లాలకే విడుదల చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ అకౌంట్లో ఓ పోస్ట్ చేశారు. "రాష్ట్రంలోని పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగులకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులు కొన్ని జిల్లాలకు మాత్రమే అందించి మరికొన్ని జిల్లాలకు అందించకపోవడం బాధాకరం. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి సిద్దిపేట్‌లోని దాదాపు 6వేల మంది కానిస్టేబుల్‌ల సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ గత ఎనిమిది నెలలుగా పెండింగ్లో పెట్టారు. పెట్రోల్, డీజిల్ బిల్లులు కూడా నెలల తరబడి చెల్లించకపోవడంతో పోలీసులు, పెట్రోల్ బంక్ యాజమాన్యం ఇబ్బందులు పడుతున్నారు. వీరి పట్ల ఎందుకంత వివక్ష.? రాష్ట్ర పోలీసులలో వీళ్ళు భాగం కాదా..? ఒకే డిపార్ట్మెంట్లో ఇంత పక్షపాతం ఎందుకు .? ఈ చర్యలు ముమ్మాటికీ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే. యూనిఫామ్ సర్వీస్ వాళ్ల కాబట్టి వాళ్ల బయటకు వచ్చి నిరసన తెలపలేకపోతున్నారు. వాళ్ళ సమస్యను నేను మీ దృష్టికి తెస్తున్నాను తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నా"అని హరీశ్ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు.


## అమాయకుడిలా కేటీఆర్ ఫోజులు, బండి సంజయ్ నిప్పులు

హైదరాబాద్: భారతీయ జనతా పార్టీలో చేరికలకు సంబంధించి కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ సిద్దాంతాలు నచ్చి, ఎవరొచ్చినా సరే స్వాగతిస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు, మిగతా నేతలు ఎవరొచ్చినా సరేనని అన్నారు. హరీశ్ రావు పార్టీ మార్పు గురించి గత కొంతకాలంగా చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి పేరును బండి సంజయ్ ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**కేటీఆర్‌పై విమర్శలు** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బండి సంజయ్ విమర్శలు చేశారు. ఆయన ఒక్కడే అమాయకుడు అనేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్‌ది కాకుంటే గతంలో రేవంత్ రెడ్డిపై ఎందుకు కేసు నమోదు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఫామ్ హౌస్ సొంతం.. ఇప్పుడు లీజు తీసుకున్నారా అని నిలదీశారు. అక్రమంగా నిర్మించిన ఫామ్ హౌస్‌ల కూల్చివేతను




సమర్థించారు. గజాల్లో కట్టిన ఇళ్లను హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) అధికారులు కూల్చివేస్తున్నారని తెలిపారు. భారీ భవన యజమానులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా కలెక్షన్ల కోసమేనని బండి సంజయ్ ఆరోపించారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల కోసం డబ్బులు పంపాలని సీఎం రేవంత్ రెడ్డికి హైకమాండ్ టార్గెట్ విధించిందని సంచలన ఆరోపణలు చేశారు. ఆ క్రమంలో హైడ్రా ఆవిర్భవించిందని గుర్తుచేశారు.




# మళ్ళీ కండువాల సీజన్

## కాంగ్రెస్ కి టచ్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు...?

# 'హస్తవాసి' బాగుంది

హైదరాబాద్ : శ్రావణ మాసం మంచి ముహూర్తం అని పాడుకుంటూ గులాబీ తోట నుంచి ఖద్దరు నీడకు చేరేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉత్సాహం చూపిస్తున్నారు అన్న ప్రచారం ఊపందుకుంది. ఆషాఢ మాసం శూన్య మాసం కావడంతో గత కొంతకాలంగా చేరికలు నిలిచిపోయాయి. దాంతో బీఆర్ఎస్ ఊపిరి పీల్చుకుంది. ఇక ఉన్న ఎమ్మెల్యేలు నికరం అని ఆ మీదట ఎవరూ పార్టీ గోడ దూకరని భావించింది. అయితే అదంతా తప్పు అని తొందరలో తేలబోయే విధంగా కండువాల కప్పే సీజన్ మొదలవుతుంది అని అంటున్నారు. రేవంత్ రెడ్డి అమెరికాలో చాలా రోజులుగా ఉండడం తో కూడా ఈ జంపింగులు ఆగాయని అంటున్నారు. అదే విధంగా మంచి రోజులూ కూడా లేవని ఆగారట. అంతే తప్ప బీఆర్ఎస్ అధినాయకత్వం చెప్పిన మాటని విని నాలుగేళ్ళ పాటు గప్ చుప్ గా గులాబీ పార్టీలో ఉంటారని పార్టీ కోసం పాటు పడతారని అనుకుంటే పొరపాటే అని అంటున్నారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ నుంచి ఇప్పటిదాకా చూస్తే పది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరారు. అందులో కేసీఆర్ తనకు అత్యంత సన్నిహితులు అని భావించిన పోచారం శ్రీనివాసరెడ్డి లాంటి వారు కూడా ఉన్నారు. బీఆర్ఎస్ కి 2023 ఎన్నికల్లో 39 సీట్లు వచ్చాయి. అందులో ఒక సీటుకు చెందిన మహిళా ఎమ్మెల్యే మరణంతో 38కి ఆ నెంబర్ చేరింది. ఇందులో నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరిపోయారు. అంటే ప్రస్తుతం ఉన్న నెంబర్ 28 మాత్రమే. ఈ నంబర్ లో నుంచి మరో ఎనిమిది మంది ఈ శ్రావణ మాసం దాటకుండానే కాంగ్రెస్ పార్టీలో చేరుతారు అని అంటున్నారు. అదే కనుక నిజం అయితే మాత్రం బీఆర్ఎస్ నంబర్ 20కి పడిపోతుంది. ఇది శ్రావణం దెబ్బ అని అంటున్నారు. ఆ తరువాత కూడా ఇదే తీరున చేరికలు కాంగ్రెస్ లో కొనసాగుతాయని అంటున్నారు. అవి ఎక్కడికి ఆగుతాయంటే ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇక చూస్తే బీఆర్ఎస్ కి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా దక్కాలీ అంటే 12 మంది ఎమ్మెల్యేలు అవసరం. అంటే మరో తొమ్మిది నుంచి పది మంది ఎమ్మెల్యేలను కూడా లాగేస్తే ఆ హోదా కూడా బీఆర్ఎస్ కి పోతుంది. ఆ విధంగా చేయాలని కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ షురూ చేస్తే మాత్రం గులాబీ పార్టీ కి ముళ్ళు గట్టిగా గుచ్చుకోవడం ఖాయమని అంటున్నారు. ఇక చేరే వారికి ఒక లాజిక్ ఉంది. అధికార పార్టీలో ఉంటే నాలుగేళ్ళ పాటు తమకు బాగా ఉంటుందని ఆ మీదట ఎన్నికలపుడు చూసుకోవచ్చు అన్నది వారి ఆలోచన. కాంగ్రెస్ లో చేరే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరికీ 2028 ఎన్నికల్లో టికెట్లు రావు అని బీఆర్ ఎస్ నేతలు చెబుతున్నారు. కేసీఆర్ రిస్క్ చెసి మరీ టికెట్లు సిట్టింగులకు ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. అలా గులాబీ పార్టీ బ్యానర్ మీద గెలిచిన వారు ఇపుడు ప్లేట్ ఫిరాయించడం తగదని కారు పార్టీ పెద్దలు అంటున్నారు. కానీ ఓడిన పార్టీలో ఉండేందుకు అయిదేళ్ల పాటు ఊడిగం చేసేందుకు ఈ రోజులలో ఎవరూ ఇష్టపడడం లేదు. ఈ రోజు ఈ రోజే రేపటి సంగతి ఆ తరువాత చూసుకోవచ్చు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే చాలా తొందరలోనే రేవంత్ రెడ్డి కారు పార్టీ ఎమ్మెల్యేలకు కండువాలు కప్పే సీన్ ఉంటుందా అంటే ఆ విధంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదే నిజం అయితే మాత్రం బీఆర్ఎస్ కి గట్టి షాక్ తగలబోతోంది అని అంటున్నారు. ఇపుడు బీఆర్ఎస్ కాంగ్రెస్ ల మధ్య సవాళ్ళూ ప్రతి సవాళ్లతో రాజకీయంగా మాటల యుద్ధం సాగుతోంది. దీనిని కొత్త టర్న్ తిప్పాలన్నా బీఆర్ఎస్ ని మాట్లాడకుండా చేయాలన్నా కండువాలు కప్పడమే బెటర్ అని అనుకుంటే మాత్రం తొందరలోనే ఆ ప్రోగ్రాం స్టార్ట్ అయిపోతుంది అని అంటున్నారు.

## సంపాదకీయం

# కర్ణాటకంలో కమలం బిజీ ఇమేజ్ ని పందెం కట్టి !

బీజేపీ అంటే తేడా పార్టీ అంటారు. ఆ తేడా కి అర్థం ఏంటి అంటే మిగిలిన పార్టీల కంటే సిద్ధాంతపరంగా తేడా అని. నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి నీతిగా నిజాయితీగా ఉండే పార్టీ అని. అయితే ఇదంతా ఒకప్పటి మాట. నరేంద్ర మోడీ అమిత్ షా నాయకత్వంలో బీజేపీ ఇపుడు నయా పాలిటిక్స్ కి తెర తీసింది. తాము అధికారంలో లేని చోట రాజకీయంగా చేయాల్సినవి అన్నీ చేస్తూ పోతోంది. 2018 లో కర్నాటకం స్టార్ట్ చేసి చాలా మంది కాంగ్రెస్ జేడీఎస్ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తరువాత మధ్యప్రదేశ్ లో అదే గేం ఆడింది. మహారాష్ట్రలో ఒకే ఫిలాసఫీ తో నడిచే చిరకాల మిత్రపక్షం అయిన శివసేనను సైతం రెండుగా చీల్చి మరీ అక్కడ అధికార పంట పండించుకుంది. జార?ండ్ లో సీఎం గా ఉన్న హేమంత్ సోరెన్ కి జైలు దారి చూపించి అక్కడ పాగా వేద్దామని ప్రయత్నం చేసింది అని కూడా విమర్శలు ఉన్నాయి. ఇపుడు తిప్పి తిప్పి మళ్ళీ కర్నాటకం స్టార్ట్ చేసింది అనుకుంటున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మీద ప్రాసిక్యూషన్ అంటూ బీజేపీ పరోక్షంగా ఆడిస్తున్న ఈ ఆటలో పావు గవర్నర్ అని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ఏమీ లేని చోట ఏదో అయినట్లుగా భ్రాంతికి కలిగించి ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టి అందులో రాజకీయ లాభం చూసుకునే కమలం తీరు పట్ల కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు నిప్పులు చెరుగుతున్నాయి. ఏణ్ణర్థం క్రితం కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపారు. కాంగ్రెస్ ని తెచ్చి పెట్టారు. అయితే ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో జేడీయూతో పొత్తు పెట్టుకుని బీజేపీ మళ్ళీ ఎక్కువ ఎంపీ సీట్లను తెచ్చుకోవడం ద్వారా తన పొలిటికల్ గ్రాఫ్ ని పెంచుకుంది. కాంగ్రెస్ సర్కార్ కొనసాగితే ఆ ప్రభుత్వం పట్ల జనాలకు విసుగు పుడితే బీజేపీకి చాన్స్ ఉండొచ్చు. అలా ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటు అయిన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ఎందుకు తాపత్రయం అని ప్రశ్నిస్తున్న వారూ ఉన్నారు. ఆ రాజకీయ అలజడిలో చలి కాచుకోవాలని ఎందుకు ఆరాటం అని కూడా నిలదీస్తున్న వారు ఉన్నారు. ఏది ఏమైనా సిద్ధరామయ్య వర్సెస్ బీజేపీగా కర్ణాటక రాజకీయం సాగుతోంది. గవర్నర్ చేసింది ఒప్పు అని బీజేపీ నేతలు సమర్ధించుకుంటూంటే కాదు గవర్నర్ బీజేపీ పెద్దలు చెప్పినట్లుగా ఆడుతున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ఈ కర్ణాటకానికి క్లైమాక్స్ ఏంటి ఎలా కధ కంచికి చేరుతుంది ఎవరికి లాభం ఎవరికి బూమరాంగ్ అన్నది ఇపుడే తెలియదు కానీ బీజేపీ మాత్రం కర్నాటకంలో చేయి పెట్టడం పట్ల విమర్శలు అయితే వస్తున్నాయని అంటున్నారు. ఈ మొత్తం రాజకీయంలో బీజేపీ ఇమేజ్ సైతం దెబ్బతింటోందని అనే వారూ ఉన్నారు. అంతలా తన అస్థిత్వాన్నే ఫణంగా పెట్టి పందెం కట్టి రాజకీయ జూదం ఆడాలా అన్న చర్చ కూడా పార్టీ లోపలా బయటా ఉంది మరి.

# పర్యవేక్షణ లేకే పక్కదారి!



హుజూరాబాద్: ఉమ్మడి జిల్లాలో 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ కింద 13.36 లక్షల మెట్రిక్ టన్నులు, 2023–24 వానాకాలం సీజన్‌లో 11.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు కేటాయించారు. కానీ అనేకసార్లు గడువు పొడిగించినా మరాడించిన బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థకు తిరిగి అప్పగించలేదు. 60 శాతానికి పైగా ధాన్యం మిల్లర్ల వద్దే ఉండటంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సీఎంఆర్ తిరిగివ్వని మిల్లర్ల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 96 రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాల సంస్థ రూ.వేల కోట్ల అప్పులు చేసి ఏటా వడ్డీలు కడుతోంది. సేకరించిన లక్షల టన్నుల ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద రైస్ మిల్లర్లకు నయాపైసా పెట్టుబడి లేకుండా అప్పగిస్తుంది. మరాడించిన బియ్యాన్ని సంస్థకు సకాలంలో అప్పగించకుండా ప్రభుత్వ ధాన్యంతో దర్జాగా వ్యాపారం చేస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. గడువులు ఇస్తూ పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ధాన్యం పక్కదారి పట్టిస్తున్నారు. జమ్మికుంట, ఇల్లందకుంటలోని రెండు మిల్లుల్లో రూ.130.20 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టించిన తీరు ఏ స్థాయిలో అక్రమ వ్యాపారం సాగుతుందో తేటతెల్లం చేసింది.

### తనిఖీలు లేక వేల క్వింటాళ్ల ధాన్యం మాయం

మిల్లర్లతో కొందరు అధికారులు మిలాఖత్ కావడం, క్షేత్ర స్థాయిలో తరచూ తనిఖీలు లేకపోవడం వల్లే పలుమార్లు గడువు పొడిగిస్తూ వచ్చినా సీఎంఆర్ సేకరణ పూర్తి కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చాలామంది మిల్లర్లు ఏవేవో కారణాలు చూపిస్తూ రెండు, మూడు సీజన్లు దాటినా బియ్యం వెనక్కి ఇవ్వడం లేదు. పౌర సరఫరాల సంస్థ కేటాయించిన ధాన్యాన్ని కొందరు మిల్లర్లు నేరుగా అమ్మేసుకుంటే.. మరికొందరు మరాడించిన బియ్యాన్ని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ఒక్కో రైస్‌మిల్లు నుంచి వేలాది క్వింటాళ్ల ధాన్యం మాయం చేస్తూ ఈ లోటును భర్తీ చేసేందుకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద ఇస్తున్నారు. విషయం బయట పడినప్పుడు కేసులు నమోదు చేయడం.. ఆ తరువాత ఆ ఊసే మరిచిపోవడం అధికారులకు రివాజుగా మారింది. ఈ క్రమంలోనే జమ్మికుంట, ఇల్లందకుంటలోని రెండు మిల్లుల్లో రూ.130.20 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఇదే నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు సమాచారం. ఈ రెండు మిల్లులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు డిఫాల్ట్ కిందకు చేర్చి రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలోని అనేక మిల్లుల్లో లక్షలాది క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు అనుమానిస్తున్న అధికారులు తనిఖీలకు సిద్ధమవుతున్నారు. దీనిపై పౌరసరఫరాల సంస్థ కరీంనగర్ జిల్లా మేనేజర్ రజనీకాంత్‌ను సంప్రదించగా బకాయిపడిన మిల్లర్ల నుంచి సీఎంఆర్ రాబట్టేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

గడువులు పొడిగించినా.. మంది మిల్లర్లు 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి పడగా ఇందులో 1.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించినట్లు అధికారులు చెబుతున్నా అత్యధిక శాతం మిల్లర్ల వద్దే ఉండిపోయింది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా తిరిగి అప్పగించకపోవడంతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ విచారణకు ఆదేశించారు. మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యం నిల్వలు ఉన్నాయా? లేదా పరిశీలించాలని టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. రెండ్రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా అసలు మిల్లుల్లో ధాన్యం లేదనే విషయం బయటపడింది. జమ్మికుంట, ఇల్లందకుంటలోని రెండు మిల్లుల్లోనే రూ.130.20 కోట్ల విలువైన 4,15,620 క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు తెలిసి ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం నివ్వెరపోయినట్లు తెలిసింది. మిల్లింగ్ సామర్థ్యం తక్కువగా ఉన్న ఈ రెండు మిల్లులకు లక్షలాది క్వింటాళ్ల ధాన్యం కేటాయించడం పలు అనుమానాలను తావిస్తోంది. దీంతో అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం.

# బల్దియా ప్రక్షాళన



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో జవాబుదారీ పాలన సాగేలా దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. కింది స్థాయి నుంచి మొదలుకొని ఉన్నత స్థాయి వరకు ప్రక్షాళన చేసేలా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రతి విభాగంపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు ఆ దిశగా గాడిన పడేలా విధానపరమైన నిర్ణయాలు అమలు చేస్తుండటంతో ఉద్యోగులు, అధికారులు సైతం నగరపాలికలో ఏం జరుగుతుందో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటికే ఉద్యోగులకు, అధికారులకు తాఖీదులు, షోకాజ్ నోటీసులు జారీ చేస్తుండటం, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై వేటు వేస్తుండటం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఫిర్యాదులపై విచారణ..

నగర పరిధిలోని ఇంజినీరింగ్, స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, శానిటేషన్ విభాగాలకు సంబంధించి రాతపూర్వకంగా వస్తున్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపిస్తున్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగంపై అత్యధిక ఉండగా వాటిపై దృష్టి సారించినట్లు సమాచారం. గతంలో జరిగిన అభివృద్ధి పనుల అంచనాలు, బిల్లుల రికార్డులు, ఏ ప్రాతిపదికన టెండర్లు పిలిచారనే కోణాలపై ఆరా తీస్తున్నారు. పైగా ఒకరిద్దరు ఇంజినీరింగ్ అధికారులకు మెమోలు జారీ అయ్యాయి. పట్టణ ప్రణాళికపై విమర్శలు వస్తుండటంతో నగరపాలక కార్యాలయంలోనే ఏకంగా ఫిర్యాదుల విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. వాణిజ్య భవనాల అనుమతులు, అక్రమ నిర్మాణాలు, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ వంటి అంశాలపై వచ్చే ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని మానిటరింగ్ కమిటీ పరిశీలించి చర్యలు తీసుకునేలా దీనిని ఏర్పాటు చేశారు. మరో వైపు ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, నిర్మాణాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. శానిటేషన్ విభాగంలో వాహనాల మరమ్మతులు, ఇతర అంశాలపై పరిశీలిస్తున్నారు. రెవెన్యూ విభాగంలో ఇంటి నంబర్ల కేటాయింపులు, పేరు మార్పిడి, ఆస్తిపన్ను మదింపు నిర్లక్ష్యం వంటి వాటిపై చర్యలు తీసుకుంటూ సర్వే చేస్తున్నారు.

### అంతర్గతంగా స్థాన చలనం

క్షేత్రస్థాయి నుంచి మొదలుకొని విభాగాల్లో పని చేసే ఉద్యోగులు, ఒప్పంద ఉద్యోగులు ఏళ్ల తరబడి ఒకే చోట పని చేస్తున్నారు. వీరంతా అక్కడే తిష్ట వేసి పెత్తనం చేస్తున్నారని, కార్పొరేటర్లకు సైతం గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులపై స్పందించి ఆయా సీట్ల నుంచి కదిలించారు. కంప్యూటర్ ఆపరేటర్లందరికి విభాగాలు మార్చారు. వివిధ సెక్షన్లలో పని చేసే వారిని, బిల్ కలెక్టర్లకు అంతర్గతంగా మార్పులు, చేర్పులు చేశారు. జవాన్లు, ఇన్‌స్పెక్టర్లకు డివిజన్లను మార్చాలనే డిమాండ్ ఉండగా మొదటగా ఒక్క ఇన్‌స్పెక్టర్లకు మాత్రమే డివిజన్లు మార్చారు. త్వరలోనే మిగతా వారిని మార్చే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతుంది.

# కూడళ్ల విస్తరణకు సై

హైదరాబాద్: ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు యుద్ధ ప్రాతిపదికన నగరంలోని ఇరుకు కూడళ్లను విస్తరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మూడు పోలీస్ కమిషనరేట్లు కూడళ్ల జాబితాను జీహెచ్ఎంసీకి అందించింది. వాటిపై నగర ప్రణాళిక విభాగం కసరత్తును ప్రారంభించింది. వరుస ఎన్నికలతో గత కమిషనర్ రోనాల్డ్‌రాస్ కూడళ్ల విస్తరణ ప్రక్రియను పరిశీలనలో ఉంచగా, కొత్త కమిషనర్ అనుమతి తీసుకుని ప్రాధాన్యక్రమంలో పనులు చేపడతామని ఇంజినీర్లు చెబుతున్నారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో.. చక్రిపురం వై జంక్షన్, ఎన్ఎఫ్‌జీ కూడలి, కుషాయిగూడ ఠాణా సమీపంలోని రమాదేవి ఆస్పత్రి కూడలి, ఏఎస్‌రావునగర్, అశోక్‌నగర్, కెనరా బ్యాంకు కూడలి, నేతాజీనగర్, హెచ్‌బీకాలనీ ఎక్స్ రోడ్డు, తల్లూరి కూడలి, కుషాయిగూడ డీమార్ట్ కూడలి, శారద చౌరస్తా, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు, రాధిక ఎక్స్ రోడ్డు, చిలకానగర్, వీటీ కమాన్, ఉప్పల్ ఎక్స్ రోడ్డు, నాగోల్ ఆనంద్‌నగర్ టీ జంక్షన్, హయత్‌నగర్ హైవే బావర్చి..

సైబరాబాద్ పరిధిలో..

ఆరాంఘర్ చౌరస్తా, పీడీపీ కూడలి, దుర్గానగర్ కూడలి, పిల్లర్ నెం.294 కూడలి, పిల్లర్ నెం.202, బన్సీలాల్‌నగర్, ట్రిపుల్ ఐటీ కూడలి, శేరిలింగంపల్లి గుల్మొహర్ కూడలి, కొండాపూర్ ఆర్టీఏ ఆఫీసు, రాడిసన్ డీఎల్ఎఫ్, విప్రో జంక్షన్, కాంటినెంటల్ ఆస్పత్రి, ఖాజాగూడ, ఐసీఐసీఐ బ్యాంకు కూడలి, బయోడైవర్సిటీ, క్యూ సిటీ, సీఓడీ, గచ్చిబౌలి, ఆల్విన్‌కాలనీ, మియాఆపూర్, ఖానామెట్, గూడెన్‌మెట్ కూడలి, తదితర కూడళ్లు. హైదరాబాద్ పరిధిలో.. హబ్సిగూడ, నల్గొండ ఎక్స్ రోడ్డు, మిథాని, మదీనా, చాదర్‌ఘాట్ రోటరీ, నానల్‌నగర్, మెహిదీపట్నం, మల్లేపల్లి నోబుల్ టాకీస్, రేతిబౌలి, టప్పాచబుత్రా, పురానాపూల్, ఎంజీ బ్రిడ్జీ భూలక్ష్మి దేవాలయం, దామోదర సంజీవయ్య విగ్రహం కూడలి, ఆర్టీసీ ఎక్స్ రోడ్డు, హుస్సేన్‌సాగర్ వరదనాలాపై బ్రిడ్జి నిర్మించి ఫ్రీ లెఫ్ట్‌ను పెంచడం, చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్డు, పంజాగుట్ట, జూబ్లిహిల్స్ రోడ్డు నెం.36, బంజారాహిల్స్ రోడ్డు నెం.1, 2 జర్నలిస్టు కాలనీ, మహారాజ అగ్రసేన్ కూడలి, తదితర కూడళ్లు ఉన్నాయి.

# వనమహోత్సవానికి సన్నద్ధం

కోరుట్ల: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి ప్రభుత్వం హరిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2014–15లో 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం'లో ఊరురా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. భారాస ప్రభుత్వ చేపట్టిన హరితహారం కార్యక్రమంను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'వనమహోత్సవం' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి లోగోను ఇటీవల ఖరారు చేసింది. గత 9 విడతలుగా మొక్కలను నాటించగా ప్రస్తుతం 10వ విడత వనమహోత్సవం కార్యక్రమం చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో మొత్తం 36,23,660 మొక్కలు నాటాలనే లక్ష్యం నిర్దేశించారు.

### సంరక్షణలో విఫలం..

జిల్లాలో ఇప్పటివరకు ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో 22,481 ప్రాంతాల్లో సుమారు 2.50 కోట్ల మొక్కలు నాటినట్లు అధికార లెక్కలు చూపుతున్నాయి. 9 ఏళ్లుగా హరితహారం కార్యక్రమంలో ఊరురా విస్తృతంగా మొక్కలు నాటి లక్ష్యం సాధించినట్లు చెబుతున్నా తర్వాత వాటిని సంరక్షణలో విఫలం కావడంతో ఆశించనంత ఫలితం ఇవ్వలేదని క్షేత్రస్థాయిలో చూస్తే తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 18



మండల్లాలో 380 గ్రామపంచాయతీల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2,078 ప్రాంతాల్లో మొత్తం 36,23,660 మొక్కలు నాటించేందుకు లక్ష్యం నిర్దేశించారు. ఇందుకోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వననర్సరీలో మొక్కలను పెంచి సిద్ధంగా ఉంచారు. గ్రామీణ ప్రాంతాల్లోని పంచాయతీ వార్డుల్లో, ఇళ్లలో, రోడ్ల కిరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, కార్యాలయాల్లో, రైతుల భూముల్లో, గుట్టలపై, ఇతర ప్రదేశాల్లో ఉపాధిహామీ ఆధ్వర్యంలో మొక్కలు నాటించేందుకు స్థలాలను గుర్తించి కొన్ని రోజులుగా కూలీలతో గుంతలను తవ్విస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొక్కలు నాటేందుకు 10.60 లక్షల గుంతలను తవ్వించి సిద్ధంగా ఉంచారు. ఇప్పటికి పలుచోట్ల 1.22 లక్షల మొక్కలను కూలీలతో నాటించారు. ఈ విషయమై జిల్లా డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావును సంప్రదించగా జులై 1 నుంచి జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయించామని, మొక్కలు నాటేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన 36.23 లక్షల మొక్కల లక్ష్యం సాధించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# పేదింటి వైద్యులు.. ఉచితంగా సేవలు

మఠంపల్లి : కనీస వసతుల్లేని మారుమూల గ్రామాల్లో పుట్టి పెరిగినా.. తల్లిదండ్రుల, సోదరుల రెక్కల కష్టంతోనే వైద్య విద్యనభ్యసించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొలువులు సాధించారు. అతి సామాన్యులకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. నేడు 'జాతీయ వైద్యుల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

### కార్మికులకు వైద్య సేవలందించే భాగ్యం

భూక్యా శివశంకర్, చెన్నాయిపాలెం

అన్నయ్య లాలూనాయక్ సహకారంతో సొంత ఊళ్లో ప్రాథమిక విద్య అనంతరం మహబూబ్‌నగర్ వైద్య కళాశాలలో 2014లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఇదే జిల్లాలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో డయాలసిస్ యూనిట్ ఇన్‌ఛార్జిగా పనిచేశాను. 2022 నుంచి హుజూర్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నా. అప్పట్లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించినా పేదరికం కారణంగా చదువు కొనసాగించలేని పరిస్థితుల్లో ప్రచురించిన కథనంతో ఎంతో మంది దాతలు స్పందించి ఆర్థిక సాయమందించారు. శ్రామికులకు చికిత్సలందించే పవిత్రమైన వృత్తిలో ఉన్నందుకు సంతృప్తికరంగా ఉంది.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివా..

బాణోతు బాలూనాయక్, బిల్యానాయక్‌తండా

ప్రాణదానం చేసే పవిత్రమైన వైద్యవృత్తి అంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. మఠంపల్లి మండలం బిల్యానాయక్‌తండా మా స్వగ్రామం. మేం ఐదుగురు అక్కాచెల్లెళ్లు, ఇద్దరం అన్నదమ్ములం. అమ్మానాన్నలు రెక్కల కష్టంతోనే నన్ను చదివించారు. నా విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే కొనసాగింది. ప్రతిభ ఆధారంగా గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, అనంతరం ఎండీ పూర్తిచేశాను. 2010లో ఖమ్మం జిల్లా ప్రాంతీయ వైద్యశాలలో కొలువు సాధించిన నేను ప్రస్తుతం సివిల్ సర్జన్‌గా సేవలందిస్తున్నాను. పల్లె ప్రజలు ఎక్కువగా చికిత్స కోసం మా దగ్గరకు వస్తుంటారు. వారికి సేవలందించడంలో ఎంతో సంతృప్తి ఉంటుంది.

### పేదలకు చికిత్సలు చేయడంలోనే సంతృప్తి

భూక్యా సుధాకర్‌నాయక్, చెన్నాయిపాలెం

మా కుటుంబంలో అన్నదమ్ములం ఇద్దరం వైద్యులమే. పేదరికాన్ని అనుభవిస్తూనే వైద్య విద్య పూర్తి చేశాం. అన్నయ్య హుజూర్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో, నేను మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులుగా పని చేస్తున్నాం. కనీస సౌకర్యాలు లేని సొంత గ్రామం చెన్నాయిపాలెంలోనే ప్రాథమిక విద్య పూర్తిచేశాను. తండ్రి లేని నేను పెద్ద అన్నయ్య లాలూనాయక్ సహకారం, ప్రభుత్వ ఉపకార వేతనాలతో కరీంనగర్ వైద్య కళాశాలలో 2017లో ఎంబీబీఎస్ పూర్తిచేశాను. 2019లో మధిరలోని సీహెచ్‌సీలో వైద్యాధికారిగా విధుల్లో చేరాను. 2023 జనవరి నుంచి మఠంపల్లి పీహెచ్‌సీలో మండల వైద్యాధికారి(ఎంవో)గా విధులు నిర్వహిస్తున్నాను. నా ఆశయాలకు అనుగుణంగా పేదలకు వైద్యసేవలు అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాను.

### స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో..

డాక్టర్ బానావత్ బాలాజీ, చెరువు తండా

మాది సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం, జాన్‌పహాడ్ సమీపంలోని చెరువుతండా. అమ్మానాన్నలు రామ, సక్రిలు ఆకుకూరలు విక్రయిస్తూ నన్ను, తమ్ముడు, చెల్లిని చదివించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో శని, ఆదివారాల్లో కూలి పనులకు వెళ్లేవాడిని. అలా పదో తరగతిలో జిల్లా ప్రథమ స్థానం సాధించాను. నా ప్రతిభ చూసి మిర్యాలగూడలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఉచిత విద్య అందించారు. ఎంసెట్‌లో 1,141వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో మూడో ర్యాంకు సాధించాను. ఎంబీబీఎస్ చదివే సమయంలోనే అమ్మకు ఊపిరితిత్తుల క్యాన్సర్ రావడంతో ఓ వైపు చికిత్స అందిస్తూనే చదువు పూర్తి చేశాను. ఎంబీబీఎస్ పూర్తయ్యాక పీజీ ప్రవేశ పరీక్షలో సైతం జాతీయ స్థాయిలో జనరల్ కేటగిరీ 709వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో మూడో ర్యాంకు సాధించాను. అనంతరం అనేక కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవకాశం వచ్చినా.. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో మిర్యాలగూడలో 2020లో ఆసుపత్రి ప్రారంభించాను. ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 40 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాను.

# అక్రమాల గుట్టు విప్పేదెవరు?

కాసిపేట : జాతీయ రహదారి పక్కనే అనుమతులు లేకుండా రియల్ వ్యాపారం సాగుతోంది. ఆ దారిలో ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు వెళ్తుంటారు. అక్కడ అనుమతి లేని ప్లాట్లు కొంటే తిప్పలు తప్పవని వారికి తెలుసు. అయినా వీటి గురించి పట్టించుకోరు. ఇది అక్రమమని తేల్చరు. దీంతో ప్లాట్లు కొన్నవారు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ అక్రమాల గుట్టు విప్పితేనే ప్రజలకు మేలు చేకూరే అవకాశముంది. బెల్లంపల్లి నియోజకవర్గంలోని సోమగూడెం నుంచి బెల్లంపల్లి మీదుగా జాతీయ రహదారి ఏర్పాటుతో రియల్ వ్యాపారం ఊపందుకుంటోంది. కొందరు రియల్ వ్యాపారులు డీటీసీపీ అనుమతులు లేకుండానే అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. బెల్లంపల్లి జాతీయ రహదారి పొడవునా అక్రమ వెంచర్లు రియల్ వ్యాపారులకు వరంగా మారుతోంది. అనుమతులు లేకుండా బండరాళ్లు ఏర్పాటు చేస్తూ విక్రయాలు చేపడుతున్నారు. గుంటల చొప్పున విక్రయాలు చేపడుతూ చిన్న చిన్న గుడిసెల నిర్మాణాలు చేపడుతున్నారు. గుడిసెల నిర్మాణాలు చేపడుతూ మున్సిపాలిటీ అధికారులను మక్కువ చేసుకొని ఇంటి అనుమతులు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రియల్ వ్యాపారులు అధికారులను మామూళ్ల మత్తులో ముంచుతున్నారనే ఆరోపణలున్నాయి.

కాసిపేట మండలంలోని పెద్దనపల్లి శివారులో జాతీయ రహదారికి



ఆనుకొని సకల హంగులతో 10 ఎకరాల్లో రెండేళ్ల కిందట వెంచర్ ఏర్పాటు చేశారు. రహదారి పక్కనే కావడంతో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో అమ్మకాలు జరిగాయి. కొనుగోలు చేసిన వెంచర్‌లో ఇంటి నిర్మాణాలు చేపడుతామంటే పంచాయతీ నుంచి అనుమతులు రావడం లేదు. దీనిపై ఆరా తీయగా వెంచర్‌కు ఇప్పటి వరకు (టీపీ) ఫైనల్ పర్మినెంట్ నెంబర్ తీసుకోలేదని తెలిసింది. ఇదంతా తెలిసి ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వెంచర్ ముందు ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూర్తి స్థాయిలో అనుమతులు పొందిన తర్వాతనే కొనుగోలు చేసుకోవాలని అధికారులు చెప్పారు.

కబ్జా చేసి.. వంతెన నిర్మించి

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాల జాతీయ రహదారి ముందు ద్వారం ఎదురుగా ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడం, వెనుకాల అటవీ ప్రాంతం ఉండడంతో భారీ ఎత్తున వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. వెంచర్‌కు వెళ్లేందుకు మధ్య వాగు ఉండడంతో ఆ స్థలం కబ్జా చేసి వంతెన నిర్మాణం చేపట్టారు. భారీగా వర్షాలు కురిస్తే వంతెన వద్ద నీరు నిలిచే అవకాశాలున్నాయి.

బండరాళ్లతో హద్దులు

బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు ఐటీఐ కళాశాల పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా బండరాళ్లతో హద్దులు ఏర్పాటు చేసి బాండు పేపరు ద్వారా విక్రయాలను చేపడుతున్నారు. కొందరు ఏమో రెండు గుంటల చొప్పున తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెబుతూ విక్రయిస్తున్నారు. అనుమతులు లేకున్నా క్రయవిక్రయాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దర్జాగా చిన్న చిన్న గుడిసెల నిర్మాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదంతా ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# గజిబిజి.. గందరగోళం

నిజామాబాద్ : ప్రతి రైతు కుటుంబానికి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మూర్ సభలో పేర్కొన్నారు. 'ఆగస్టు 15 వరకు ఖాతాల్లో జమ చేస్తానని సిద్ధులగుట్టపై ఒట్టేసి చెబుతున్నానంటూ' చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. మాఫీ ఎక్కడంటూ ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. లబ్ధి చేకూరని అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో లక్ష మందికి పైగా రైతులు లబ్ధిచేకూరక ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి జిల్లాలో ఆహార, వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం ఎక్కువ. ప్రతి కుటుంబానికి సగటున 2 నుంచి 5 ఎకరాలు ఉంటుంది. పసుపు వేస్తే ఎకరానికి కనిష్ఠంగా రూ.80 వేల వరకు బ్యాంకులు పంట రుణాలిస్తాయి. దీంతో సగానికి పైగా రైతులకు రూ.2 లక్షలకు పైగా రుణాలు పొందడం జిల్లాలో సర్వసాధారణమైంది. వీరంతా తమ పేర్లు జాబితాలో లేకపోయే సరికి గగ్గోలు పెడుతున్నారు.

నిట్టూరుస్తూ..

జిల్లాలో 5.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. దాదాపు 2.25 లక్షల మంది రైతులుంటారు. ఇందులో 95 శాతం మంది మంది పదెకరాల్లోపు వారే. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటి వరకు మూడు విడతల్లో 78,748 ఖాతాలకే ప్రయోజనం చేకూరింది. వాస్తవానికి ఏటా ఒక సీజన్‌లో బ్యాంకులు సుమారుగా రూ.1400 కోట్ల పంట రుణాలిస్తాయి. ఇందులో సగం అర్హుల జాబితా ఉన్నా రూ.700 కోట్లు రావాలి. కానీ, 626.49 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. ప్రభుత్వం రైతు వారీగా కాకుండా కుటుంబం ప్రాతిపదికన గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించడంతో లక్షకు పైగా రైతులు లబ్ధి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల సొసైటీలు, బ్యాంకుల తప్పిదాలు, ఇంకొందరికి ఆధార్, బ్యాంకు ఖాతా, చరవాణి అనుసంధానం లేకపోవడం తదితర కారణాలతో సుమారు 10 వేల మంది ప్రయోజనం పొందలేకపోయారు. వీరికి క్షేత్రస్థాయిలో ధ్రువపత్రాలు పరిశీలించి లబ్ధి చేకూరుస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. కానీ, అర్హతలున్నా తమ పేర్లు ఎందుకు మూడో జాబితాలో లేవని పెద్ద రైతులు నిట్టూరుస్తున్నారు. ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గాల్లో ఎక్కువ మందికి రూ.2 లక్షలకు పైగానే రుణాలుండడంతో మాఫీ అమలుపై ఆందోళన చెందుతున్నారు. వీరంతా కలిపి మరో 80 వేల ఖాతాలు ఉంటాయని భావిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

– వాజీద్‌హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి రుణమాఫీ జాబితా ఏఈవోలు, మండల వ్యవసాయాధికారుల వద్ద అందుబాటులో ఉంచాం. ఏదైనా కారణంతో మాఫీ వర్తించకుంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించాం. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఖాతాల్లో డబ్బులు పడతాయి. మిగతా వారికి ప్రయోజనం చేకూర్చేందుకు సర్కారు చర్యలు తీసుకుంటుంది. ఎవరూ ఆందోళన చెందొద్దు.

# జల సిరి.. అంతటా వరి



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలోనూ వరి ప్రధాన పంటగా నిలవనుంది. ఎల్ఎండీ ఎగువ ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటి విడుదల.. ఎల్లంపల్లి ఎత్తిపోతలతో వరద కాలువ ద్వారా పంటలకు అందించే అవకాశం కలగటం, సాధారణానికి మించి వర్షపాతం నమోదు కావటంతో వరి నాట్లు జోరందుకున్నాయి. వ్యవసాయ శాఖ తాజా నివేదిక ప్రకారం కరీంనగర్ జిల్లాలో అన్నిపంటల సాగు 89.07 శాతానికి, పెద్దపల్లి 86.19, జగిత్యాల 73.27, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 88.54 శాతానికి చేరింది. ఈ నెలాఖరు వరకు వరినాట్లు వేసేందుకు, అతిస్వల్పకాలిక రకాలతో సెప్టెంబరు మొదటి వారం లోపు నాట్లు వేసేందుకు, నేరుగా వెదజల్లి వరి విత్తనాలను విత్తేందుకు అదనుండటం.. ఖాళీ నేలల్లో నువ్వు, కూరగాయలు తదితర పంటలను పండించే అవకాశం ఉండటంతో అన్ని జిల్లాల్లోనూ సాగు విస్తీర్ణం వంద శాతం దాటే అవకాశముంది. నిరుడు వానాకాలంతో పోలిస్తే కేవలం పసుపు సాగు విస్తీర్ణం మాత్రమే పెరగగా పత్తి, మక్క, సోయాబీన్, పెసర, మినుము, అలసంద తదితర తగ్గి ఈ పంటల స్థానంలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో సన్న రకాల సాగువిస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. సన్నగింజ రకాల్లో చీడపీడల తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున మేలైన యాజమాన్యం పాటించాలని వరి శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీనివాస్ సూచించారు.

# పంట పండినట్లే



కోనరావుపేట: మెట్ట ప్రాంతానికి తలమానికమైన నిమ్మపల్లి మూలవాగు చెరువు ఎగువన అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మత్తడి పోస్తుంది. దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టు 2,500 ఎకరాలతోపాటు మూలవాగు పరీవాహక గ్రామాల్లో రెండు పంటలకు సాగునీటికి డోకా ఉండదు. దీంతో అన్నదాతలు పంట సాగుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో 1978లో రెండు గుట్టల మధ్య 19 అడుగుల సామర్థ్యంతో చెరువు నిర్మించారు. ఇందులోకి నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం చీమన్‌పల్లి, పందిమడుగు, జినగాల, తాటిపల్లి, వీర్నపల్లి మండలం వన్‌పల్లి, శాంతినగర్‌తో పాటు ఇతర అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వరద వచ్చి చేరడంతో పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతోంది. కుడి కాలువ ద్వారా నిమ్మపల్లి, కొండాపూర్ గ్రామాల్లోని 1,500 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా జైసేవాలాల్ ఊరుతండా, జైసేవాలాల్ ఆజ్మీరాతండా, జైసేవాలాల్ భూక్యారెడ్డితండా, జైసేవాలాల్ కమ్మరిపేటతండా, వట్టిమల్ల, గొల్లపల్లి గ్రామాల్లోని వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. మత్తడి దూకడంతో పరీవాహక గ్రామాలైన కొండాపూర్, బావుసాయిపేట, వెంకట్రావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్, కనగర్తి, వేములవాడ గ్రామీణ మండలం బొల్లారం, హన్మాజీపేట, లింగంపల్లి, మల్లారం, వేములవాడ అర్బన్ మండలం జయవరం, తిప్పాపూర్, సంకెపల్లి పరీవాహక గ్రామాలకు చెందిన ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మూలవాగు పారడంతో భూగర్భ జలాలు పెరిగి వానాకాలం, యాసంగి సీజన్‌ల్లో రెండు పంటలకు సాగు నీటికి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూలవాగులోని చెక్‌డ్యాంలు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. ఫలితంగా వరి పంటకు నీటి కొరత ఉండదు.

ఆలస్యంతో ఆందోళన చెందాం నాకు మూలవాగు చెరువు కుడి కాలువ కింద ఎనిమిది ఎకరాలు ఉంది. మూలవాగు చెరువు పైనే ఆధారపడి వరి సాగు చేస్తుంటాను. చెరువు నిండటంతో ఆయకట్టు రైతులందరికీ పంటకు డోకా ఉండదు. మొదట వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ఈ ఏడాది చెరువు నిండుతుందో, లేదోనని రైతులంతా ఆందోళన చెందాం. ఎట్టకేలకు చెరువు నిండటంతో పంటల సాగుకు భరోసా కలిగింది. అమరం శ్రీనివాస్‌రెడ్డి, ఆయకట్టు రైతు, నిమ్మపల్లి

అందుబాటులో భూగర్భ జలాలు

నాకు రెండున్నర ఎకరాల సొంత భూమి ఉంది. మరో ఒకటిన్నర ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. మూలవాగులోని బోరుబావి సహాయంతో పంటకు నీరు అందిస్తుంటాను. ఇటీవల కురిసిన వర్షానికి నిమ్మపల్లి చెరువు మత్తడి దూకడంతో మూలవాగు పారడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో వానాకాలం, యాసంగి రెండు పంటలకు సాగు నీరు అందనున్నది. చీటి మోహన్‌రావు, రైతు, బావుసాయిపేట

# కబ్జా కోరల్లో బ్రాహ్మణకుంట

చొప్పదండి: పురపాలక సంఘం పరిధిలోని బ్రాహ్మణకుంట శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. అయినా అధికారులు తమకేమి పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కుంట పరిధిలో సుమారు 25 ఎకరాల విస్తీర్ణం ఉండేది. కానీ నీళ్లు లేకపోవడంతో పక్కనే ఉన్న పట్టాదారులతోపాటు మరికొందరు ఆక్రమణలు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పక్క సర్వే నంబర్‌తో విక్రయాలు

బ్రాహ్మణకుంట శిఖం సర్వే నంబర్ 300 కాగా పక్కనే ఉన్న 301 సర్వే నంబర్‌లోని భూమి పాత పట్టాదారు పాసుపుస్తకాలతో కొంతమంది దస్తావేజులు చేసి పెట్టుకున్నారు. కొందరు పట్టాదారుల మధ్య ఉన్న విభేదాలను ఆసరాగా చేసుకుంటున్నారు. పాత దస్తావేజులతో మోఖాపై భూమి లేకున్నా కొత్త దస్తావేజులు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. శిఖం భూమిని చూపించి కొన్ని ప్రైవేటు ఫైనాన్స్‌లలో రుణాలు తీసుకున్నారు. లేఅవుట్లు లేకుండానే భూమి క్రయవిక్రయాలు చేపట్టారు.

ఇంటి అనుమతులకు దరఖాస్తులు

భూమిని కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు పురపాలక సంఘం పరిధిలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ శిఖం భూములకు సమీపంలో ఉండడంతో అనుమానంతో ఇళ్ల అనుమతులను తిరస్కరించారు. అయినా కొందరు ఆ భూముల్లో నిర్మాణాలు చేసుకున్నారు. పురపాలక శాఖ అధికారులు అటు వైపు చూడకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. కొంతమంది శిఖం భూములకు హద్దులు కేటాయించాలని కోరుతూ రెవెన్యూ, నీటిపారుదల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కానీ ఇంతవరకు కేటాయించలేదు. హద్దులు లేకపోవడంతో కొందరి పట్టాభూములకు సైతం ఇంటి అనుమతులు రావడంలేదు. అధికారుల తీరుపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



సర్వే చేయించేలా చర్యలు

బ్రాహ్మణకుంట శిఖం భూమిని సర్వే చేయించేలా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు లేకుండా చూస్తాం. శిఖం భూమిలో ఎలాంటి ఇంటి నిర్మాణాలు ఉన్నా కూల్చివేయిస్తాం. తప్పుడు దస్తావేజులు సృష్టించిన వారిపైనా చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేస్తాం. పి.నవీన్‌కుమార్, తహసీల్దార్


ఎన్‌వోసీ దరఖాస్తుతో..

కుంట శిఖం భూమికి ఆనుకొని నిర్మించుకున్న ఇళ్లకు అనుమతులు కోరుతూ దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల నుంచి నిరంభ్యతర పత్రం(ఎన్‌వోసీ) దరఖాస్తుతో సమర్పిస్తే అనుమతులు ఇస్తామని వారికి చెప్పాం. ఎన్‌వోసీ వచ్చే వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోం. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాల భూమి శిఖం భూమిలో కాకుండా బఫర్‌జోన్ బయట ఉన్నట్లు తెలిసింది. కె.నాగరాజు, పురపాలిక కమిషనర్

# ప్రతిభకు.. ఉపకార వేతనం తోడు!

పాల్వంచ : ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. తాజాగా 'నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)' పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సర్కారు విద్యాలయాల్లో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఏటా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రతిభ చూపిన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు. కానీ, కొన్ని పాఠశాలల విద్యార్థులు దరఖాస్తుకు దూరంగా ఉంటున్నారు. అవగాహన లేమి, ప్రచారలోపం, ఉపాధ్యాయుల నిరాసక్తతే దీనిక్కారణం. ఈ సారైనా పాఠశాలల నిర్వాహకులు ఎక్కువ మందితో ఆన్‌లైన్ దరఖాస్తులు చేయించాలి. సెప్టెంబరు 11 వరకు ఈ వెసులుబాటు ఉంది.

ఉభయ జిల్లాల్లో 674 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 40 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై.. ప్రస్తుత ఏడాది 8వ తరగతి చదువుతున్న వారికి ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నారు. దీనికి ఉమ్మడి జిల్లా నుంచి ఏటా 2 వేల మంది లోపే హాజరవుతున్నారు. ప్రతిభ చూపి ఉపకార వేతనాలకు అర్హత



సాధిస్తున్న వారు వందల్లోపే ఉంటున్నారు. గత మూడేళ్లలో ఈ అవకాశం రెండు జిల్లాల నుంచి కేవలం 406 మందికే దక్కింది. ఇప్పటికైనా విద్యాశాఖ విద్యార్థుల్లో చైతన్యం కలిగించాలి. ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలి. ఈ విషయంలో కొన్ని పాఠశాలలు మాత్రం ఆదర్శంగా నిలుస్తున్నాయి.

అర్హులు వీరే.. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ఆదర్శ పాఠశాల విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ఏడో తరగతి ఫలితాల్లో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వారు 50 శాతం మార్కులు సాధిస్తే చాలు. కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలి. అన్ని ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలి. 'ఉపకార వేతన రాత పరీక్ష 180 మార్కులకు నవంబరు 24న నిర్వహిస్తారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఎక్కువ మంది ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి. హెచ్.ఎం.లకు సమాచారం అందజేస్తాం' అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరీక్షల సహాయాధికారి మాధవరావు తెలిపారు.

'ఏటా మా పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో ఉపకార వేతనాలకు ఎంపికవుతున్నారు. సీనియర్ల స్ఫూర్తితో, ఉపాధ్యాయుల సహకారంతో పరీక్షలకు సన్నద్ధమవుతున్నాం. సన్నద్ధానికి ప్రతిరోజు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నాం'

బిల్లకంటి దేవర్షిత, కేటీపీఎస్ బాలికోన్నత పాఠశాల, పాల్వంచ

'రెగ్యులర్ చదువుతో పాటు ప్రతిభ పరీక్షకు సన్నద్ధమవుతున్నాం. ఉపాధ్యాయులు మెలకువలు నేర్పుతున్నారు. మా పాఠశాలలో ఎంతో మంది వేతనాలకు ఎంపిక అవుతున్నారు. ఈ సంవత్సరం 12 మంది బృందంగా ఏర్పడి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాం.' గుడ్ల శ్యాం కౌశిక్, మాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల, మధిర మండలం

# ఆస్వాదిస్తూ.. ఆరాధిస్తూ!

కొత్తగూడెం : కొందరికి ప్రకృతి అంటే ఇష్టం. మరికొందరికి ఆధ్యాత్మిక చింతన ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో ప్రకృతి పర్యాటక అభివృద్ధి కోసం అటవీ, అటవీయేతర ప్రాంతాలను కలిపి 12 సర్క్యూట్లను అధికారులు గుర్తించారు. వీటిలో భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని, ఖమ్మం జిల్లాలోని కనకగిరి అటవీ ప్రాంతాలున్నాయి. ఉభయ జిల్లాల్లో పాలేరు నుంచి పర్ణశాల వరకు ప్రధాన ఆలయాలు, చారిత్రక ప్రాంతాలను కలుపుతూ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధిపరచాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల, పొంగులేటి, తదితరులు ఇటీవల ఉభయ జిల్లాల్లో పర్యటించారు.

కూసుమంచి గణపేశ్వరాలయం

కూసుమంచిలోని గణపేశ్వరాలయం కాకతీయుల భక్తిభావం, కళావైభవానికి తార్కాణంగా నిలుస్తోంది. ఇక్కడి శివలింగం దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద శివలింగాల్లో ఒకటి. ఏటా శివరాత్రికి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల భక్తులు ఇక్కడికి వస్తుంటారు.

శ్రీస్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

ఖమ్మంలో ఎత్తైన గుట్టపై శ్రీస్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. భక్త ప్రహ్లాదుడిని రక్షించేందుకు నరసింహస్వామివారు ఈ ఆలయంలోని ఒక స్తంభం నుంచి బయటకు వచ్చారని కథనం.

వైరాలో అయ్యప్పస్వామి క్షేత్రం

వైరాలోని శ్రీఅయ్యప్పస్వామి క్షేత్రం విశిష్టత ఏంటంటే.. ఇక్కడ 45 ఫీట్ల ఎత్తు కలిగిన ఆంజనేయస్వామి విగ్రహం, రామాలయం, వెంకటేశ్వరాలయం, జ్యోతిర్లింగాలయం, సరస్వతి ఆలయంతో పాటు షిర్డీ సాయిబాబా ఆలయాలుంటాయి. ఖమ్మం మీదుగా భద్రాచలం వెళ్లే భక్తులు ఈక్షేత్రాన్ని సందర్శించవచ్చు.

నేలకొండపల్లి మహా బౌద్ధస్తూపం

నేలకొండపల్లి సమీపంలోని ముజ్జుగూడెంలో మహాబౌద్ధస్తూపం దేశంలోని అతిపెద్ద స్తూపాల్లో ఒకటి. బౌద్ధ భిక్షువులు నివసించిన ఆరామాలు ఇప్పటికీ ఇక్కడి నేలమాళిగల్లో భద్రంగా ఉన్నాయి. నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఇక్కడే శ్రీరాముడి మహాభక్తుడైన రామదాసు ద్యానమందిరం ఉంది.

మహా పుణ్యక్షేత్రం భద్రాచలం

దక్షిణ అయోధ్యగా భద్రాచలం భాసిల్లుతోంది. ఏటా సుమారు 40లక్షల మంది భక్తులు భద్రాచలం రామాలయానికి వస్తున్నట్లు అంచనా. అమెరికా, శ్రీలంక, జర్మనీ, రష్యా, బ్రిటన్, తదితర దేశాలకు చెందినవారు, ప్రవాస భారతీయులు ఇక్కడికి వస్తున్నారు.

ఖమ్మం ఖిల్లా.. జాఫర్ బావి

శతాబ్దాల చరిత్ర కలిగిన ఖమ్మం ఖిల్లా ఎన్నో వింతలు, విశేషాలకు నిలయం. ఈ కోటకు దక్షిణ భాగంలో ఉన్న బావిని స్థానికులు జాఫర్ బావిగా.. పురావస్తుశాఖ అధికారులు మెట్ల బావిగా పిలుస్తుంటారు. పర్యాటకంగా అభివృద్ధిపరచటానికి ఖిల్లాపై రూ.30కోట్లతో రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు.

పర్ణశాలసీతాదేవిని రావణాసురుడు అపహరించిన ప్రాంతమిది. సీతమ్మ వాడిన నారచీరలు ఇప్పటికీ దర్శనమిస్తాయి. రామాయణంలోని ముఖ్యఘట్టాలకు వేదిక ఇది. సీతాదేవి స్నానానికి వేడినీళ్లను ఉపయోగించిన ప్రాంతం ఉష్ణ గుండాలగా ప్రసిద్ధి చెందింది.

మోతెగడ్డ దివ్యక్షేత్రం బూర్గంపాడు మండలం మోతెగడ్డ దివ్యక్షేత్రం పవిత్ర స్థలంగా వెలుగొందుతోంది. వరదల సమయంలో చుట్టూ నీరుచేరి దీవిలా కనిపిస్తుంది. భద్రాచలం నుంచి పర్ణశాల వరకు బోటు ఏర్పాటుచేస్తే మార్గమధ్యలో ఈ దీవికి చేరుకోవచ్చు.

# దోమల నియంత్రణ.. కార్యాచరణ మమ!

పెద్దపల్లి: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాలు విజృంభిస్తున్నాయి.. జ్వర బాధితులు లేని ఇళ్లు ఉండటం లేదు.. వర్షాలతో దోమల బెడద పెరిగింది.. పట్టణాల్లో ఖాళీ స్థలాలు, మురుగు నిల్వ ప్రాంతాలు వాటికి ఆవాసాలుగా మారాయి.. స్థానిక సంస్థలకు క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ప్రజలకు సేవలందడం లేదు. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 14 పురపాలికల పరిధిలో పారిశుద్ధ్య చర్యలు, దోమల నివారణ, ఇంటింటికీ చెత్త సేకరణ–నిర్వహణ కార్యక్రమాలు నామమాత్రంగా సాగుతున్నాయి. పురపాలిక బడ్జెట్‌లో దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలకే అధిక మొత్తం కేటాయింపులుంటున్నాయి. నగరపాలికల్లో గరిష్ఠంగా రూ.6 కోట్లు, పురపాలికల్లో రూ.2 కోట్ల వరకు ఏటా ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. పైగా నిధులు పక్కదారి పడుతున్నాయి. వానాకాలంలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది చోద్యం చూడటమే తప్ప వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడం లేదంటూ ప్రతి వారం కలెక్టరేట్‌లలో ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**వారానికి ఒక్క రోజు కూడా గగనమే**

అర్బన్ మలేరియా విభాగానికి చెందిన కార్మికుడు ప్రతి రోజూ 300 ఇళ్ల పరిసరాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలి. పని చేసినట్లు ఆధారంగా కాలనీవాసుల సంతకాలు తీసుకోవాలి. ఆ



వివరాలను సంబంధిత విభాగానికి అందించాలి. అయితే ఇది ఉన్నతాధికారుల తనిఖీల సమయంలో తప్ప రోజువారీగా జరగడం లేదు. ఫాగింగ్ విధులు నిర్వర్తించే కార్మికులు నిత్యం తెల్లవారుజామునే ఆరోగ్యాధికారి, ఆరోగ్య కార్యకర్తలకు కనిపిస్తారు. సాయంత్రం ఫాగింగ్ పూర్తయిందని చెబుతూ పెట్రోల్, డీజిల్ కూపన్లు తీసుకుంటున్నారు. నామమాత్రంగా ఫాగింగ్ చేసి మిగిలిన ఇంధనాన్ని నల్లబజారుకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రామగుండం, కరీంనగర్ నగరాల్లోని మురికివాడల్లో, ప్రధాన వీధుల్లో కనీసం వారానికి ఒక్క రోజైనా ఫాగింగ్ చేయలేదనే విమర్శలున్నాయి.

ఫాగింగ్ యంత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు బిగిస్తే తప్ప ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా లేదు. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు యంత్రాలు పని చేయడం లేదని తాపీగా సమాధానాలిస్తున్నారు. కొందరు సీనియర్ అధికారుల అండదండలతోనే ఈ విభాగంలో అక్రమాలు జరుగుతున్నాయని, కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**యంత్రాలకు మరమ్మతులేవీ!**

ఉమ్మడి జిల్లా జనాభా దాదాపు 40 లక్షలు కాగా దోమల నివారణకు ప్రతి కుటుంబం ఏటా సగటున రూ.3 వేల వరకు వెచ్చిస్తోంది. దాదాపు రూ.10 కోట్ల మేర రీపెల్లెంట్స్, కాయిల్స్, రసాయన ద్రావణాల వాడకం జరుగుతోంది. ఒక ఇంటిలో ఒకరికి జ్వరం వస్తే మిగతా అందరికీ విస్తరిస్తోంది. దీంతో నెల రోజుల వ్యవధిలో చికిత్సకు, వివిధ పరీక్షలకు రూ.10 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.

కరీంనగర్ నగరపాలక సంస్థలో 10 ఫాగింగ్ యంత్రాలుంటే 6 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన నాలుగు మరమ్మతుకు నోచుకోవడం లేదు. తరచూ కాకుండా ఎప్పుడో ఓసారి ఫాగింగ్ చేస్తున్నారు. రామగుండం నగరపాలికలో 5 యంత్రాలుంటే 3 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన రెండింటిని మరమ్మతు చేయాల్సి ఉండగా చేయడం లేదు. ఒక్కో పురపాలికలో నాలుగేసి చొప్పున మొత్తం 14 పురపాలికల్లో 56 యంత్రాలుండగా ఇందులో 25 పని చేయడం లేదని సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు.

# గ్రేటర్‌లో వాహన విస్ఫోటం

హైదరాబాద్: నగరంలో వ్యక్తిగత వాహనాల రద్దీ ఊహించని విధంగా ఉంటోంది. ఏటా 6 నుంచి 10 శాతం వరకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. గ్రేటర్‌లో 9100 కి.మీ.ల మేర రోడ్లుండగా.. వాహనాల సంఖ్య 81.21 లక్షలకు దాటింది. ప్రతి కి.మీ.కి దాదాపు 892 వాహనాలు తిరుగుతున్నాయి. ఇప్పటికే బైక్‌ల సంఖ్య 59 లక్షలకు దాటింది. ప్రజారవాణాతోనే అడ్డుకట్ట హెచ్‌ఎండీఏ సమకూర్చుకున్న డబుల్‌డెక్కర్ బస్సులను ఖాళీగా తిప్పుతున్నప్పటికీ.. ప్రజారవాణాకు సంబంధించి వివిధ రకాల పద్ధతులను హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) అధ్యయనం చేస్తోంది. హెచ్‌ఎండీఏలోని ఉ



మ్టా(యూనిఫైడ్ మెట్రోపొలిటిన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ) దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ దేశాల్లో ఉన్న విధానాలపై అధ్యయం చేసి మన నగరానికి ఎలాంటి రవాణా విధానం అమల్లోకి తెస్తే బాగుంటుందో అధికారులు పరిశీలిస్తున్నారు. మెట్రోను ట్రాఫిక్ రద్దీ ఎక్కువున్న ప్రాంతాలకు విస్తరించడంతో పాటు.. 2–3 కిలోమీటర్ల దూరానికి ప్రజలు వ్యక్తిగత వాహనాలు వాడకుండా...ప్రజారవాణా వైపు దృష్టిసారించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఆల్టనేటివ్ అర్బన్ మొబిలిటీ సొల్యూషన్ ఫర్ హైదరాబాద్ పేరుతో వివిధ విధానాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కేబుల్ కార్లు, పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ లాంటి రవాణా సదుపాయాలు నగరానికి ఎంతవరకు అనుకూలంగా ఉంటాయనే విషయమై పరిశీలిస్తున్నారు.

ఇంటి నుంచి కార్యాలయాలకు నేరుగా ప్రజారవాణా ఉండేలా ఏర్పాట్లు చేసినప్పుడే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రజారవాణాను ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమంగా చూడాలంటున్నారు.

# తెల్లకార్డు లేక.. పథకాలు అందక



పరిగి : రేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రకటించడంతో పేదలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. సంక్షేమ పథకాలకు తెల్లకార్డులే ప్రామాణికంగా తీసుకోవడంతో నిరుపేదలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా కార్డుల జారీ నిలిపివేయడంతో పాటు ఉన్న వాటిని సైతం వివిధ కారణాలతో రద్దు చేశారు. తొలగించిన కార్డుల్లో ఎవరైనా అర్హులు ఉంటే పునరుద్ధరించనున్నట్లు అధికారులు మూడేళ్ల క్రితం పేర్కొన్నారు. దీంతో కార్డులు కోల్పోయిన నిరుపేదలకు ఊరట కలిగింది. జిల్లా ఎక్కువగా గ్రామీణ ప్రాంతం కావడం, వ్యవసాయాధారితం కావడంతో ప్రభుత్వం అందించే రేషన్‌పైనే చాలా మంది ఆధారపడ్డారు. కార్డులు కోల్పోయిన కారణంగా నిరుపేదలు సరుకులు విపణిలో కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారింది.

రద్దయిన కార్డులు

జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో పలు కారణాలు చూపుతూ 24వేల కార్డులను తొలగించారు. వీరందరికీ నోటీసులు అందజేశారు. లబ్ధిదారులు ఇచ్చే సమాధానంతో క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు పొంది, మరికొందరు చనిపోవడం, గ్రామంలో లేకుండా పోవడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నా అడుగు ముందుకు పడలేదు. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేకపోయింది. దీంతో కొందరు అర్హులు కూడా కార్డులను కోల్పోవాల్సి రావడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోతున్నారు. గత అర్జీలను పక్కనపెట్టిన సర్కారు తాజాగా ప్రజాపాలనలో వచ్చిన వాటికే ప్రాధాన్యత ఇవ్వనుంది.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలోనూ రేషన్ కార్డులకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. దాదాపు పదివేలకు పైగానే అర్జీలు వచ్చినట్లు సమాచారం. కార్డులు లేని కారణంగా గృహజ్యోతి, రుణమాఫీ, గ్యాస్ పథకాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా త్వరగా అందించి ఫలాలు అందే విధంగా చూడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ – రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి

ఖాళీగా ఉన్న డీలరు పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ మండలాల్లో ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశాం. కొత్త కార్డులకు సంబంధించిన సమాచారం అధికారికంగా రాలేదు.

# బదిలీలు.. బాధ్యతలు



హైదరాబాద్: రాష్ట్ర స్థాయి బదిలీల్లో భాగంగా జీహెచ్‌ఎంసీకి కొత్తగా వచ్చిన అధికారులకు బాధ్యతల అప్పగింత, ఇప్పటికే ఇక్కడ పనిచేస్తున్న పలువురికి అంతర్గత స్థానచలనం కల్పించే ప్రక్రియ మొదలైంది. పారిశుద్ధ్య, ప్రణాళిక విభాగాల్లోని పలువురు అధికారులకు బాధ్యతలు కేటాయిస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. అంతర్గత బదిలీలు ఇంకా ఉంటాయని, వేర్వేరు విభాగాల్లో రెండేళ్ళగా ఒకే స్థానంలో ఉన్న అధికారులు, నాలుగేళ్లుగా ఒకే కుర్చీలో ఉన్న సిబ్బందికి స్థాన చలనం తప్పదని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. టౌన్‌ప్లానింగ్‌లో..అదనపు సీసీపీ(చీఫ్ సిటీ ప్లానర్), ఖైరతాబాద్ జోన్ సీపీ(సిటీ ప్లానర్)గా వెంకన్న, శేరిలింగంపల్లి జోన్ సీపీగా శ్యామ్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, చార్మినార్, జోన్లకు ఇన్‌ఛార్జి సీపీలుగా రఘునందన్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, గణపతి, మాజిద్ నియమితులయ్యారు. ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు ఏసీపీగా ప్రతాప్, మలక్‌పేట డీసీపీగా గజానంద్, చాంద్రాయణగుట్ట ఏసీపీగా భానుచందర్, చార్మినార్‌కు రాందాస్, ఫలక్‌నుమాకు మంజులసింగ్, రాజేంద్రనగర్‌కు శ్రీధర్, ముషీరాబాద్‌కు దేవేందర్, అంబర్‌పేట్‌కు సుమిత్ర, జూబ్లీహిల్స్‌కు శ్రీనివాస్, యూసుఫ్‌గూడకు కృష్ణవేణి, చందానగర్‌కు సురేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లికి సాయిబాబా, మల్కాజిగిరి, సికింద్రాబాద్‌కు వి.బి.శ్రీనివాసరావు ఏసీపీలుగా నియమితులయ్యారు. పారిశుద్ధ్యంలో 27 మందికి..సర్కిళ్ల వారీ పారిశుద్ధ్య బాధ్యతలను సహాయ వైద్యాధికారులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నిర్వర్తిస్తారు. ఆయా హోదాల్లోని 27 మందికి స్థానచలనం కలిగింది.

# సేకరణలో నిర్లక్ష్యం.. కుప్పలుగాచెత్త

జగిత్యాల : జిల్లాకేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది. స్థానిక 33, 16, 32వ వార్డులకు చెందిన చెత్త సేకరణ ఆటోలు 2 నెలలుగా రావడంలేదు. పట్టణంలో కాలానుగుణ వ్యాధులు పెరుగుతున్నాయి. మరోవైపు డెంగీ విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో చెత్త సేకరణ చేపట్టకపోవడంపై పలు కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రతిరోజు 70 మెట్రిక్‌టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 46 ఆటోలు, 13 ట్రాక్టర్లు, డంపర్ పేసర్, టిప్పర్‌తోపాటు స్వీపింగ్ యంత్రం ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణకు 38 శాశ్వత, 262 ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన కొరవడి కార్మికుల హాజరు, ఇంధన వినియోగంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

మరమ్మతులో 14 ఆటోలు..

ఏడాది కాలంగా బల్దియాలో 14 ఆటోలు పనిచేయడంలేదు. మొత్తం 46 ఆటోల్లో 14 ఆటోలు మరమ్మతులో ఉండటంతో పలు వార్డుల్లో చెత్త సేకరణ సజావుగా చేపట్టడంలేదు. ఉన్న కొన్ని ఆటోలు, సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో తరచూ వాహనాలు మొరాయిస్తున్నాయి. మరమ్మతు చేపట్టాల్సిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. 13 ట్రాక్టర్లలో ఒక ట్రాక్టరు మూలన పడేశారు. రూ.40 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం ఏడాది కాలంగా మెకానిక్ షెడ్డుకే పరిమితమైంది. ప్రధాన రహదారుల్లోనూ శుభ్రత అంతంతమాత్రంగానే ఉంది.

ఒకే ఏడాదిలో రూ.35 లక్షలు..2023 సంవత్సరంలో ఒకే ఏడాదిలో వాహనాల మరమ్మతు పేరిట రూ.35 లక్షలు ఖర్చు చేశారు. బల్దియాలో తొలుత రూ.10 లక్షలకు అనుమతి తీసుకొని వరుసగా మరమ్మతు బిల్లులు రూ.35 లక్షలు వ్యయం చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులు ఎజెండాకు రావడంతో మెజార్టీ సభ్యులు అభ్యంతర వ్యక్తం చేయడంతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్పటి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బిల్లుల మంజూరు నిలిపివేసి మరమ్మతు కోసం టెక్నికల్ అధికారిని నియమించారు. గత 4 నెలల నుంచి ఇంజినీరింగ్ విభాగం వారే మరమ్మతు చేపడుతున్నారు.



'వీరంతా స్థానిక 33వ వార్డు కాలనీవాసులు. రెండు నెలలుగా తమ వార్డుకు కేటాయించిన ఆటో చెత్తసేకరణకు రాకపోవడంతో చెత్తను వీధుల్లో వేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఫిర్యాదు చేస్తే వాహనం మరమ్మతుకు గురైందని ప్రత్యామ్నాయంగా వారానికోసారి పక్క వార్డు వాహనాన్ని పంపిస్తున్నారని వాపోయారు. చెత్త సేకరణ లేకపోవడంతో తాము రోగాల బారిన పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'

వారానికోసారి..

లావణ్య, జగిత్యాలమా వార్డులో రెండు నెలల నుంచి చెత్త సేకరణ ఆటో రావడంలేదు. అడిగితే వారానికోసారి ఓ ఆటో వచ్చినా అందులో చెత్తకు చోటులేకుండాపోతోంది. వీధుల్లోనూ ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోతోంది. అసలే వానాకాలం జ్వరాలు పెరుగుతున్నాయి. విపరీతమైన దుర్గంధం, దోమలతో వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. పేరుకుపోతున్న వ్యర్థాలు కేసరి సుశీల, జగిత్యాల

చెత్తబుట్టలు నిండుకొని ఇంట్లోనే ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. మా వార్డుకు కేటాయించిన ఆటోను మరమ్మతు చేసి వెంటనే ఇవ్వాలి. లేదంటే మహిళమంతా ఆందోళన చేపడతాం. ఇళ్లలో వృద్ధులు, పిల్లలు ఉంటారు. చెత్త కారణగా దోమలు పెరిగి జ్వరాల బారిన పడితే మాకు దిక్కెవరు.

# హెచ్‌ఎండీఏ భూములకు రక్షణేది?

జిన్నారం : ఐడీఏ బొల్లారం పరిధిలోని సర్వే నంబరు 278లో గతంలో ఉన్న రోడ్డును మార్చి హెచ్‌ఎండీఏ స్థలాలను ఆక్రమించి రహదారి వేశారు. ఈ అక్రమణను అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే సర్వే నంబరులోని ఓ భారీ వెంచరు కోసం సుమారు రెండు ఎకరాలను ఆక్రమించుకున్నట్లు ఆరోపణలున్నాయి.

సర్వే నంబరు 284లో 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో మినీ స్టేడియానికి కేటాయించారు. ఆ తర్వాత సంబంధిత భూములను హెచ్‌ఎండీఏ పరిధిలోకి మార్చారు. ఈ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా.. పట్టించుకునే వారే కరవయ్యారు. ఖాజీపల్లి పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిన్నారం మండలంలోని ఐడీఏ బొల్లారం, ఖాజీపల్లి గ్రామాల శివారులో.. బాహ్య వలయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలాలను 2004లో రెవెన్యూ శాఖ హెచ్‌ఎండీఏకు అప్పగించింది. అక్కడి భూముల ధరలు భారీగా పెరగడంతో ఆక్రమణదారుల కన్ను వాటిపై పడింది. క్రమంగా ఆక్రమిస్తూ విక్రయిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే చాలా స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కొందరు ఆక్రమణదారులు జీవో 59 ప్రకారం స్థలాలను క్రమబద్ధీకరించుకున్నారు.



**రోడ్లు వేస్తున్నా పట్టింపు లేదు**

ఐడీఏ బొల్లారం పరిధిలో 194 ఎకరాలు, ఖాజీపల్లి పరిధిలో 72 ఎకరాల హెచ్‌ఎండీఏ స్థలాలున్నాయి. ఇక్కడ గజం భూమి విలువ రూ.30 వేలకు పైగా ఉంది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఖాజీపల్లి నుంచి ఐడీఏ బొల్లారం వరకు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న గుట్టను తవ్వేశారు. ఈ విషయాన్ని గుర్తించిన సంబంధిత అధికారులు వ్యాపారిపై కేసు పెట్టారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు లేవు. అదే స్థిరాస్తి సంస్థ మరో చోట కాలనీ కోసం రోడ్డు వేసింది. ఇలా రూ.కోట్ల విలువ చేసే భూములు పరాధీనమవుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

రమణారెడ్డి, హెచ్‌ఎండీఏ క్షేత్రాధికారి

హెచ్‌ఎండీఏ పరిధిలోని స్థలాలు ఎక్కడ కబ్జాకు గురైనా వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఐడీఏ బొల్లారం పరిధిలోని కొన్ని స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని మాకు ఫిర్యాదులు అందాయి. సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించాం. ఖాజీపల్లి, బొల్లారంలో నిర్దేశిత హద్దులు లేకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# సర్కారు కళాశాలలకు అరకొర నిధులు

సంగారెడ్డి : ప్రభుత్వ కళాశాలల్లో పేద విద్యార్థులే ఎక్కువ మంది చదువుతారు. వీటి నిర్వహణకు సరిపడా నిధులు కేటాయించి.. బోధన మెరుగుగా ఉంటే పేద విద్యార్థుల భవిత ఉత్తమంగా ఉంటుంది. కానీ సంబంధిత శాఖ అరకొర కేటాయింపులు చేసి.. చేతులు దులుపుకొంటుండటంతో కళాశాలల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల ప్రధానాచార్యులు సొంతంగా డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**రూ.1.64 లక్షల విడుదల**

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి ఈ విద్యా సంవత్సరం జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. నిర్వహణ కోసం అరకొర నిధులు మంజూరు చేస్తున్నారు. అవీ నాలుగు నెలలకోసారి అందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా మొదటి విడత కింద ఒక్కో కళాశాలకు రూ.25 చొప్పున కేటాయించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నిర్వహణ నిధుల మొత్తాన్ని పెంచకపోవడంపై ప్రధానాచార్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తొలి విడత కింద జిల్లాకు రూ.1.64లక్షలు ఇటీవల విడుదల చేశారు.

**రుసుంల వసూలు నిలిపేయడంతో..**

2012–2013 విద్యా సంవత్సరం వరకు ప్రవేశాల సమయంలో విద్యార్థుల నుంచి కొంత రుసుం వసూలు చేసేవారు. ఈ మొత్తాన్ని కళాశాల నిర్వహణకు ఖర్చు చేసేందుకు వీలుండేది. పిల్లల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 2014 నుంచి రుసుంల వసూలును నిలిపివేసింది. సర్కారే నేరుగా నిర్వహణ నిధుల్ని



అందిస్తోంది. విద్యా సంవత్సరం అంతా కలిపి ఒక్కో విద్యార్థికి రూ.100 చొప్పున కేటాయించగా మొదటి విడత కింద రూ.25 చొప్పున విడుదల చేయగా.. నిధులు సరిపోని పరిస్థితి నెలకొంది.

సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తా

గోవిందరామ్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్ని కళాశాలల ఖాతాలకు సర్దుబాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి రూ.25 చొప్పున విడుదలయ్యాయి. నిర్వహణ నిధులు పెంచాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతా.

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు: 20

ప్రథమ సంవత్సరం విద్యార్థులు: 4,027

ద్వితీయ: 3,395

# పక్కాగా పంటల నమోదు

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలో వానాకాలం పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది నేరుగా పంట పొలాలకు వద్దకు వెళ్లి సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల సర్వర్ సమస్యలు తలెత్తినా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆగస్టు నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని గడవు విధించింది. ఈ మేరకు ప్రస్తుతం పత్తి, కంది, జీలుగ, వరి తదితర పంటల లెక్క తేల్చుతున్నారు. వీటితోపాటు రైతుల బ్యాంకు, పట్టాదారు పాసుపుస్తకం, చరవాణి సంఖ్య, ఆధార్, తదితర వివరాలనూ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించి ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. నిర్లక్ష్యం వ్యవహరిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

తప్పుల సవరణకు అవకాశం

ఉమ్మడి జిల్లాలో వరి, పత్తి, మిర్చి, కంది, పెసర, ఇతర పంటలు 17,87,923 ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. అందుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను కూడా అందుబా



టులో ఉంచారు. ఇప్పటి వరకు 1,85,162 ఎకరాల్లో సేద్యంలో ఉన్న పత్తి, కంది, జీలుగ, తదితర పంటల వివరాలు నమోదు చేశారు. ఈ ప్రక్రియ నిర్వహణలో గతంలో వెనుకబడిన మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వేగంగా పూర్తి చేసేలా తగు ఏర్పాట్లు చేపడుతున్నారు. నమోదు పూర్తయిన తర్వాత జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించి రైతులు చూసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. తప్పులు నమోదైతే సవరించుకునే అవకాశం ఇవ్వనున్నారు.

నమోదు కాకుంటే ఇబ్బందులు ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లలో ఉమ్మడి జిల్లాలో పత్తి, వరి, వేరుసెనగ, తదితర పంటలను రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. పంట పేరు, సాగు విస్తీర్ణం వివరాలను నమోదు చేయించుకోకుంటే ఉత్పత్తులు విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన తర్వాత ఆన్‌లైన్‌లో ఉన్న సాగు భూమికి సరిపడా దిగుబడి ఉండాలి. తేడాలుంటే నగదు చెల్లింపులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇలాగే నమోదు చేసుకోని రైతులు గతంలో ధాన్యం విక్రయించాక.. బిల్లులు రాక అధికారుల చుట్టూ తిరిగారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వేగంగా పూర్తి చేసేలా చర్యలు

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం పత్తి, కంది, జీలుగ వివరాలను వేగంగా నమోదు చేస్తున్నారు. అన్నదాతలు నార్లు పోస్తున్నారు.. నాట్లు పూర్తి కాగానే వాటినీ ఆన్‌లైన్ చేస్తాం. ప్రతి పంట వివరాలనూ తప్పనిసరిగా నమోదు చేస్తాం.

# చరవాణితో.. జర భద్రం

నల్గొండ : ఇటీవల నల్గొండ జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు వెల్లడించే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు చరవాణిలో నిమగ్నమయ్యారు. సాక్షాత్తు మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో జరిగిన జిల్లా సమావేశంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి తీవ్ర విమర్శలకు దారి తీసింది. మునుగోడు మండలం కొరటికల్‌లో చరవాణిలో ఎక్కువ సమయం గడుపుతున్న కుమారుడిని తండ్రి మందలించడంతో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

ఒకప్పుడు పుస్తకం హస్త భూషణం.. ఖరీదైన చేతి గడియారం దర్పానికి ప్రతీక.. ఇప్పుడు ఆ స్థానాన్ని చరవాణి ఆక్రమించింది. ఖరీదైన స్మార్ట్‌ఫోన్.. పేరున్న బ్రాండ్.. ఏ ఇద్దరు మాట్లాడుకున్నా ఇదే. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ చరవాణి తప్పనిసరిగా మారింది. మంచి, చెడులు సమ్మిళితమై ఉన్న ఈ యంత్రాన్ని మనం దేనికి ఉపయోగిస్తే అలా తయారవుతాం అంటున్నారు నిపుణులు. కొందరు ఏకంగా రెండు, మూడు చరవాణులు వాడేస్తున్నారని, ఇది వ్యసనంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు. ఇటీవల ప్రతి ఒక్కరూ నిద్ర లేవగానే చరవాణి చూడటంతో దినచర్య ప్రారంభిస్తున్నారు. రాత్రి 11-12 గంటల వరకు ఇదే నేస్తం. బస్సుల్లో, రైళ్లలో ప్రయాణించేటప్పుడు నిరంతరాయంగా చరవాణితోనే గడుపుతున్నారు.

నిద్రలేమి సమస్య..

రోజువారి విధులు, పాఠశాల, కళాశాల.. ఇతర ప్రాంతాల్లో ఎవరిని చూసినా రోజంతా చరవాణితో కనిపిస్తున్నారు. గతంలో సమాచార సేకరణ, సంభాషణకు ఉన్న చరవాణి నేడు సామాజిక మాధ్యమాల్లో గడిపేందుకు మొగ్గు చూపేలా చేస్తోంది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్)లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వాటిలో వీడియోలు, చిత్రాలు పోస్టు చేసి, ఎంతమంది వీక్షించారు, కామెంట్లు పెట్టారు, లైకులు కొట్టారు అంటూ తరచూ చూస్తున్నారు. నిద్రలేమి సమస్యను ఎదుర్కొంటున్నారు.

మానసిక ఒత్తిడి..

అంతర్జాలం, చరవాణి నిద్రను దూరం చేస్తున్నాయని ఇటలీ, అమెరికాకు చెందిన విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా ప్రకటించాయి. రాత్రంతా చరవాణిపై శ్రద్ధ పెట్టి ఉదయాన్నే లేవాల్సి రావడంతో రోజంతా చురుకుదనం లోపిస్తుందని, ఇది ఇలాగే కొనసాగితే సమస్యలు తప్పవని స్పష్టం చేసింది. కనీసం 8 గంటల నిద్ర అవసరమని తెలియజేసింది.

ఇబ్బందులు ఇలా..

మితిమీరిన చరవాణి వినియోగం నిద్రలేమిని తెచ్చి పెడుతుంది.

రేడియేషన్ కారణంగా కంటి, మెదడుకు సంబంధించిన సమస్యలు వస్తాయి.

జ్ఞాపకశక్తి లోపించడంతో పాటు కుంగుబాటుకు గురవుతారు.

కళ్లపై ఎక్కువ భారం పడి ఒత్తిడికి గురవుతారు.

రెటినా దెబ్బతిని శుక్లాల సమస్య ఏర్పడుతుంది.

దీర్ఘకాలంలో క్యాన్సర్‌కు దారి తీస్తుంది.

# అడ్డదారి.. అపాయకారి



హైదరాబాద్: బడికెళ్లే పిల్లలకు ప్రభుత్వ చట్టాలు, నిబంధనల గురించి అవగాహన కల్పిస్తేనే భవిష్యత్తులో పాటిస్తారు. మంచి పౌరులుగా ఎదుగుతారు. అలాంటి చిన్నారుల కళ్ల ముందే అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘిస్తే...! వారూ భవిష్యత్తులో అలాగే చేసే అవకాశం ఉంది. పలువురు తల్లిదండ్రులు సైతం హెల్మెట్ ధరించకపోవడంతో పాటు చిన్నారుల్ని వాహనంపై రాంగ్‌రూట్లో తీసుకెళ్తున్నారు. ఇక స్కూల్ బస్సులు, ఆటోలు, వ్యాన్లు వంటి ప్రైవేటు వాహనాల్లో రవాణా మరింత దారుణంగా ఉంటోంది. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 27న స్కూల్ వాహనాల్ని తరలించే వాహనాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించగా... ఒకేరోజు 564 మంది నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టుబడ్డారు. వారందరిపైనా కేసులు నమోదు చేశారు.

నిర్లక్ష్యం జరుగుతోందిలా..!

బడిబస్సుల విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, రవాణా శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కలిపి 12,631 బడి బస్సులు ఉండగా అందులో 876 వాహనాలు ఇంకా ఫిట్‌నెస్ తీసుకోకపోవడం దీనికి నిదర్శనం. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో రవాణా శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నా ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులు సైతం ప్రైవేటు ఆటోలు, వ్యాన్లు, ఇతర వాహనాల్లో చిన్నారుల్ని పంపించే ముందు డ్రైవరు అనుభవజ్ఞుడేనా.. వాహనానికి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పట్టించుకోవడం లేదు.

నిబంధనలివీ..!

ముగ్గురు ప్రయాణికుల్ని తీసుకెళ్లే ఆటోలో 12 ఏళ్ల లోపు విద్యార్థులు ఆరుగుర్ని మాత్రమే తరలించాలి.

నలుగురు ప్రయాణికుల్ని తీసుకెళ్లే ఆటోలో 8 మంది చిన్నారుల్ని తీసుకెళ్లాలి.

స్కూల్ బస్సు లేదా ప్రైవేటు వాహనం ఫిట్‌నెస్ ధ్రువీకరణ తప్పనిసరి.

డ్రైవరుకు వాహనం నడపడంలో ఐదేళ్ల అనుభవం ఉండాలి. 60 ఏళ్లు మించి ఉండకూడదు. బస్సులో డ్రైవర్‌తోపాటు సహాయకుడు ఉండాలి.

కొన్ని ప్రమాద ఘటనలు..

జనవరిలో హబ్సిగూడలో బస్సు చక్రాల కింద పడి రెండేళ్ల చిన్నారి మృతి.

చిన్నారిని చూసుకోకుండా డ్రైవరు నడపడంతో చర్లపల్లి బీఎన్‌రెడ్డి నగర్‌లో బస్సుకింద పడి మూడేళ్ల చిన్నారి మరణించాడు.

హయత్‌నగర్ కుంట్లూరులో బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడపడంతో మూడేళ్ల చిన్నారి దుర్మరణం.

# ఖజానా వెల వెల.. పనులు చేసేదెలా..?



హైదరాబాద్: రాజధానిలో కీలకమైన ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ఆచూతూచి అడుగులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మూసీ నదిపై 14 వంతెనలను నిర్మించాలన్న గత ప్రభుత్వం ప్రతిపాదనల్లో ఒక్కటి మినహా మిగిలినవి పక్కన పెట్టాలని నిర్ణయించింది. వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి పథకం (ఎస్‌ఆర్‌డీపీ) కింద మూడో దశలో చేపట్టే పనులు సైతం దాదాపుగా నిలిచిపోనున్నాయి. ఇందుకు నిధుల లేమి కారణమని చెబుతున్నారు. మరికొన్ని ప్రాజెక్టుల ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాతే ఆమోదముద్ర వేయాలని సర్కార్ భావిస్తోంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయడం మీదే దృష్టి పెట్టాలని నిర్ణయించారు.

మరికొన్ని ఇలా..గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ నుంచి కొండాపూర్ వైపు రూ.175 కోట్లతో నిర్మితమవుతున్న ఆకాశమార్గం పనులు నిలిచిపోయాయి. నిధుల లేమితో ఈ వంతెనకు భూసేకరణను అధికారులు ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు.

సంతోష్‌నగర్ దగ్గర రూ.300 కోట్లతో చేపట్టిన స్టీల్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో గుత్తేదారు నెమ్మదిగా చేస్తున్నారు. ఏడాది కిందటే పనులు పూర్తి చేయాల్సి ఉంది.

ఆరాంఘర్-జూపార్కు బ్రిడ్జి నిర్మాణం పనులు అంతమాత్రంగానే జరుగుతున్నాయి. నిధులు లేకపోవడంతో రెండోదశ కింద మరో రూ.4 వేల కోట్లతో చేపట్టే పనులను నిలిపివేశారు. మూడో దశ కింద చేపట్టే పనులు ఇప్పట్లో మొదలయ్యే అవకాశం లేదు.

నత్తనడకన ఎస్‌ఆర్‌డీపీ పనులు

నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఎస్‌ఆర్‌డీపీ నిధులతో ఆకాశమార్గాలు, రోడ్ల విస్తరణ తదితర ప్రాజెక్టులు చేపట్టాలని గత ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. మొదటి దశ కింద రూ.5 వేల కోట్లతో పనులు పూర్తి చేశారు. రెండో దశలో మరో రూ.5 వేల కోట్లతో పనులు చేయాలనుకున్నారు. ఇందులో రూ.వెయ్యి కోట్ల పనులు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. మొదటి దశ కింద రుణం తీసుకుని పనులు పూర్తి చేశారు. రెండో దశకు నిధుల కొరత ఏర్పడింది. దీంతో బడ్జెట్‌లో రూ.3500 కోట్ల నిధులను కేటాయించాలని బల్దియా అధికారులు గత ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీనికి ఆమోదముద్ర వేయలేదు. ఫలితంగా కీలక ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయి. కొన్నింటిలో పనులు ఆగిపోయాయి.

సుందరీకరణకే మొగ్గు..

మూసీ నదిపై 14 బ్రిడ్జిలను నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో తలపెట్టారు. దీనికి రూ.550 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం మూసారాంబాగ్ దగ్గర మాత్రమే మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. మిగిలిన 13 చోట్ల పనులకు పిలిచిన టెండర్లను రద్దు చేయమని ప్రభుత్వం కోరినట్లు సమాచారం. వచ్చే మూడేళ్లలో మూసీ సుందరీకరణను పూర్తి చేసి అవసరమైన చోట వంతెనలు నిర్మించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్తవి నిర్మించాల్సిన అవసరమేముందనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. నిధుల సమీకరణను బట్టే కొత్త ప్రాజెక్టులను మొదలపెట్టాలని నిర్ణయించారు. నిధులు లేకుండా అప్పటికప్పుడు చేపటొద్దని సర్కారు కోరింది.

# సాంకేతికత గారడీ.. విధులకు బురిడీ


కరీంనగర్ : విధుల్లో పారదర్శకత కోసం సర్కారు సాంకేతికతను ప్రవేశపెడితే దాన్ని పక్కదారి పట్టించి, నకిలీ జీపీఎస్ యాప్ సహాయంతో కొందరు గ్రామ కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతుండటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చాలామంది విధులు సక్రమంగానే నిర్వర్తిస్తున్నారు. ఫిబ్రవరిలో సర్పంచుల పదవీకాలం ముగియటంతో కార్యదర్శులపై పర్యవేక్షణ కొరవడింది. ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారులుగా వేర్వేరు శాఖల్లో పని చేస్తున్న వారిని ప్రభుత్వం నియమించినప్పటికీ వారి మాతృశాఖ పనులపైనే దృష్టి నిలుపుతున్నారు. ప్రధానంగా ప్రత్యేక అధికారి పర్యవేక్షణ లోపించింది. ఎప్పుడో ఓసారి పంచాయతీకి వచ్చి చెక్కులపైన సంతకాలు చేయటం తప్ప గ్రామ అవసరాలపై దృష్టి సారించటం లేదు. అంతా తామే అన్నట్లుగా పంచాయతీ కార్యదర్శులు విధులకు సక్రమంగా హాజరుకావటంలేదని పలు గ్రామాల్లో ప్రజలు పేర్కొంటున్నారు. ఒక కార్యదర్శి విధులు నిర్వర్తించాల్సిన గ్రామానికి వెళ్లక మూడు రోజులవుతుంది. కానీ అతను విధులకు హాజరైనట్లుగా యాప్‌లో నమోదవుతోంది. నకిలీ యాప్ సహాయంతో హాజరును నమోదు చేస్తున్నారు. ఇలా కొన్ని రోజులుగా చేస్తున్నారు.

313 పంచాయతీల్లో..

జిల్లాలోని 313 పంచాయతీల్లోని గ్రామ కార్యదర్శులు 90 శాతం మంది గ్రామ సమీపంలోని పట్టణాల్లో నివసిస్తున్నారు. మారుమూల గ్రామాలతోపాటు పట్టణ సమీప గ్రామ పంచాయతీ కార్యదర్శులు సైతం ఈ నకిలీ యాప్ తతంగం నడిపిస్తున్నట్లు తెలిసింది. ఉదయం 8 గంటలకు విధులకు హాజరై మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా గ్రామంలో అందుబాటులో ఉండాలి. పలువురు కార్యదర్శులు నిబద్ధతతో పని చేస్తున్నా.. మరికొందరు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

నకిలీ జీపీఎస్ సహాయంతో...

కొంతకాలంగా పంచాయతీ కార్యదర్శులకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. అదే తరహాలో చరవాణుల్లో ప్లేస్టోర్ నుంచి 'నకిలీ జీపీఎస్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సెట్టింగ్స్‌లో అక్షాంశం, రేఖాంశాల సంఖ్యతో మార్చేస్తున్నారు. వారు ఇంట్లో ఉన్నా లేదా సొంత పనులపై ఎక్కడికైనా వెళ్లినా అక్కడి నుంచి స్వీయ చిత్రం దిగి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆ చిత్రం పంచాయతీ పరిధి ప్రాంతంతో పోలి ఉండటంతో వారు విధులకు



డుమ్మా కొట్టినా అనుమానం రావడంలేదు. మరో అడుగు ముందుకేసిన కొందరు రెండో సిమ్ నంబరుతో జీపీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఆ ఫోన్‌ను మల్టీపర్పస్ కార్మికులకు ఇస్తున్నారు. వారు స్వీయ చిత్రం దిగకుండా పంచాయతీ కార్యాలయ చిత్రాన్ని, డ్రైనేజీ క్లీనింగ్, రోడ్లు ఊడ్చే ఫొటో, నర్సరీ చిత్రాలను తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు.

సేకరించిన చెత్త ఊరి శివారులో..

గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా జరుగుతుందా? లేదా అని ఉదయమే విధుల్లోకి వెళ్లి పర్యవేక్షించాల్సిన కార్యదర్శులు అక్కడ లేకపోవటంతో పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో సేకరించిన చెత్తను ఊరి శివారులో రోడ్లు, కాల్వల పక్కన పడేస్తున్నారు. మరో వైపు డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి దోమలు వృద్ధి చెంది కాలానుగుణ వ్యాధుల బారిన పడే పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. గ్రామస్థులకు అవసరమైన జనన, మరణ, ధ్రువీకరణ పత్రాల కోసం పంచాయతీల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

నిరూపణ అయితే చర్యలు

నకిలీ యాప్‌ను వినియోగిస్తున్నారనే ఫిర్యాదు మా దృష్టికి వచ్చింది. కార్యదర్శులపై నిఘా ఏర్పాటు చేస్తాం. మరో యాప్ ద్వారా ఫొటోలు పెట్టాలని సూచిస్తాం. నిరూపణ అయితే చర్యలు తప్పవు.

రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి, కరీంనగర్

# సీఎంఆర్ బకాయిల వసూలుకు.. రంగం సిద్ధం

హుజూర్‌నగర్ : సీఎంఆర్ బకాయిల వసూలుకు ఆర్‌ఆర్ యాక్టు (రెవెన్యూ రికవరీ చట్టం) అమలు చేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు మిల్లర్లు కోర్టును ఆశ్రయించి అధికారులను ముప్పుతిప్పలు పెట్టవచ్చు అనుకున్నారు. కానీ, జూన్ 26న హైకోర్టు చేసిన వ్యాఖ్యలతో మిల్లర్లు ఖంగుతిన్నారు.

ఆర్‌ఆర్ యాక్టుకు సన్నద్ధం

సీఎంఆర్ బకాయి బియ్యం వసూలు చేసేందుకు అధికారులు అన్ని ప్రయత్నాలు చేశారు. చివరకు బకాయిపడిన మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు లేకుండా చేశారు. అలాంటి మిల్లర్లు రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది ఉండగా, ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 16 మంది ఉన్నారు. వీరందరినీ డీఫాల్టర్లుగా ప్రకటించారు. కోర్టుకు వెళ్తే తమకు బియ్యం చెల్లింపుపై వాయిదా దొరుకుతుందని వారు అధికారులను బెదిరిస్తూ వచ్చారు. దీంతో వారు కోర్టుకు పోకుండా బుజ్జగించే ధోరణిలో వసూలు చేసుకోవాలనే అధికారులు అనుకున్నారు. అయినా మిల్లర్లు వినే పరిస్థితి లేకపోవడంతో కొన్ని మిల్లులపై దాడులు చేసి,



బాధ్యులను అరెస్ట్ చేశారు. ఒక్క సూర్యాపేటలోనే రూ.64 కోట్ల విలువైన బియ్యం పెట్టాల్సి ఉండటంతో అధికారులు దూకుడుగా వ్యవహరించారు. కోదాడ, సూర్యాపేటలోని కొందరు మిల్లర్లు కోర్టును ఆశ్రయించడంతో వారికి అక్కడ చుక్కెదురైంది. తీసుకున్న ధాన్యానికి బియ్యం వెంటనే ఇవ్వాలని, లేకుంటే ఏసీబీని రంగంలోకి దించుతామని, ఆర్‌ఆర్ యాక్టునూ అమలు చేస్తారని కోర్టు వ్యాఖ్యానిం చడంతో పౌరసరఫరాల అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్లకు ఇది మింగుడు పడకుండా ఉంది. 2019-20, 2020-21, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ల బకాయిల వసూలుకు మిల్లర్లపై కఠినంగా వ్యవహరించడంతో పాటు జప్తులు, అవసరమైతే క్రిమినల్ కేసులైనా నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి.

# చెప్పిందే ధర..!

భానుపురి :సూర్యాపేట కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరకే వినియోగదారులు కొనాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు నిర్ణయించిన ధరకు విక్రయించకుండా ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. రైతుబజారులో ఏర్పాటు చేసిన ధరల పట్టిక ప్రకారం అమ్మాల్సి ఉండగా.. వ్యాపారులు మాత్రం పెంచి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమని అడిగితే కూరగాయల కొరత ఉందని, ధరలు పెరిగాయని సాకులు చెబుతున్నారు.

పట్టికకే పరిమితం

సూర్యాపేట కూరగాయల మార్కెట్‌లో ఎస్టేట్ అధికారులు రోజు వారీగా ధరలను నిర్ణయిస్తారు. ఈ వివరాలను రైతుబజారులోని గోడలపై గల పట్టికలో రాస్తారు. వీటి ప్రకారం అందరూ అమ్మకాలు సాగించాలి. వ్యాపారులు పట్టిక కంటే ఎక్కువకు అమ్ముతున్నారు. బోర్డుపై కిలో టమాట రూ.50 ఉంటే రూ.70 నుంచి రూ.80 వరకు, పచ్చిమిర్చి ధర రూ.60 ఉంటే రూ.100 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. అన్నింటికీ ఇదే తంతు సాగుతోంది. రైతులు రైతు బజార్‌లో అమ్మాల్సి ఉండగా.. బయటి వ్యాపారులతో కలిసి వ్యాపారం చేస్తున్నారు. దీంతో



వినియోగదారులు నిలువునా మోస పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. కనీసం క్షేత్రస్థాయిలో తనిఖీలు జరపడం లేదు.రోజువారీగా పర్యవేక్షణ చేస్తాం

అరుణిమ, రైతుబజారు ఎస్టేట్ అధికారిణి, సూర్యాపేట

కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు ధరల పట్టిక ప్రకారం అమ్మకాలు చేయటం లేదనే విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు చేపడతాం. రైతులు మార్కెట్‌లో విక్రయాలు జరపొద్దు. ఇక నుంచి రోజువారీగా పర్యవేక్షణ చేస్తాం.

# కాలానికి తగ్గట్టు నైపుణ్యంతో సాన పట్టు

హైదరాబాద్: డేటా సైన్స్, కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతలో వస్తున్న మార్పులతో పాత కొలువులు కనుమరుగై.. కొత్త ఉద్యోగాలు తలుపులు తడుతున్నాయి. వాటిని అందిపుచ్చుకోవాలంటే అందుకు తగ్గ నైపుణ్యాలు అవసరమని నిపుణులు చెబుతున్నారు.ఆత్మవిశ్వాసం పెరిగేలా..

చదువులు పూర్తికాగానే ఉద్యోగాల్లో చేరుతున్న చాలామందిలో తగిన నైపుణ్యాలు ఉండటం లేదని సంస్థలు ఫిర్యాదు చేస్తుంటాయి. నైపుణ్య శిక్షణతో తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని 29 శాతం మంది ప్రారంభ ఉద్యోగులు వెల్లడించారు.

కెరీర్‌లో నైపుణ్యాలు పెంచుకోవడం ముఖ్యమని సర్వేలో పాల్గొన్న నిపుణుల్లో 79 శాతం మంది పేర్కొన్నారు.


సొంత సంస్థలో కెరీర్ వృద్ధికి..

సర్వే చేసిన నిపుణుల్లో 39 శాతం మంది తమ ప్రస్తుత సంస్థలో కెరీర్ వృద్ధికి అప్‌స్కిల్లింగ్ అవసరమని భావిస్తున్నారు. వీరిలో 17 శాతం మంది వ్యక్తిగత ఆసక్తితో నేర్చుకుంటున్నారు.

యజమాని తమపై ఉంచిన అంచనాలను అందుకోవడం కోసం 13 శాతం మంది నైపుణ్యాలను పెంచుకునేందుకు మొగ్గుచూపుతున్నారు.

సవాళ్లు ఏమున్నాయ్..

నైపుణ్యాలను పెంచుకునేందుకు సమయం వెచ్చించాలి.. 34 శాతం మంది ఉద్యోగులు పనితో తీరిక లేకపోవడంతో సమయం కేటాయించలేకపోతున్నామని చెప్పారు. 19 శాతం మంది వృత్తి నిపుణులు ఆర్థిక పరిస్థితులు అవరోధంగా ఉన్నాయని వెల్లడించారు.




# ఓటుకు నోటు కేసులో సీఎం చంద్రబాబుకి భారీ ఊరట..

ఢిల్లీ: ఓటుకు నోటు కేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కు భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబుని నిందితుడిగా చేర్చాలని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని వైసీపీ నేత ఆళ్లరామకృష్ణారెడ్డి వేసిన రెండు పిటిషన్లను ధర్మాసనం డిస్మిస్ చేసింది. దాఖలైన రెండు పిటిషన్లను జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం విచారించింది. రాజకీయ కక్ష సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దంటూ పిటిషనర్ రామకృష్ణారెడ్డిని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం మందలించింది. ఆ మేరకు ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టులను వాడుకోవద్దని పిటిషనర్ రామకృష్ణారెడ్డిని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఆధార రహిత అంశాలను తీసుకువచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దంటూ తీవ్రంగా స్పందించింది.

పిటిషనర్ రాజకీయ నేపథ్యంపై ధర్మాసనం ఆరా తీసింది. ఈ సందర్భంగా పిటిషనర్ 2014 నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారంటూ చంద్రబాబు తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ ప్రతిపక్షంలో ఉందని సీఎం తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టుకు తెలిపారు. కావాలంటే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని తప్ప రాజకీయ కక్షల కోసం ధర్మాసనం వద్దకు రావొద్దంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటుకు నోటు వ్యవహారంపై సుప్రీంకోర్టులో వేరే కేసులు కూడా ఉన్నాయని రామకృష్ణారెడ్డి తరపు న్యాయవాది ధర్మాసనం ఎదుట ఓ జాబితా పెట్టారు. ఆ కేసులకు, ఇప్పుడు వాదనలు జరుగుతున్న కేసులకు సంబంధం లేదన్న చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా పేర్కొన్నారు. కేసుల జాబితా చూశాక పిటిషనర్ రామకృష్ణారెడ్డిపై ధర్మాసనం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలు కనపడటం లేదని తెలిపింది.

# వైకాపా హయాంలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు: మంత్రి ఆనం



నెల్లూరు: వైకాపా హయాంలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుల పనులు చేయకుండా నిలిపేశారన్నారు. నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి, తెదేపా నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరిగేషన్‌పై మాజీ సీఎం జగన్‌కు చిత్తశుద్ధి, అవగాహన లేదని మండిపడ్డారు. వైకాపా పాలనలో రైతులు నాశనమయ్యారన్నారు. "సోమశిల ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకొస్తాం.

దెబ్బతిన్న కాంక్రీట్ పనులు వచ్చే సీజన్‌కు పూర్తి చేసేలా ప్రణాళిక రచిస్తున్నాం. రాళ్లపాడు ప్రాజెక్టుకు నీళ్లు తీసుకెళ్లేలా ప్రణాళికలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం వరదల్లో సోమశిల జలాశయం దెబ్బతిన్నా జగన్ ప్రభుత్వం పటించుకోలేదు. రైతుల ఆందోళనను తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకస్మికంగా వచ్చి రైతులతో ప్రజావేదిక నిర్వహించారు.

జగన్‌లా పోలీసు బలగాలు లేవు, తెరలు మాటున రాలేదు, ఒక్క చెట్టునూ తొలగించలేదు. సోమశిల వద్ద దెబ్బతిన్న పనులను సీఎం పరిశీలించారు. విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు. భవిష్యత్‌పై ప్రణాళిక, అవగాహన లేని నాయకుడు జగన్" అని ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు.

# పంచాయతీల అభివృద్ధికి రూ.900 కోట్లు జమ చేయడంపై వైవీబీ హర్షం



తిరుపతి, ఆగస్టు 21: పంచాయతీల అభివృద్ధి కోసం సర్పంచ్‌ల ఖాతాలలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 988 కోట్లు జమచేయడంపై పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హెఆర్డీ మంత్రి లోకేష్‌కు చాంబర్ తరపున అభినందనలు తెలియజేశారు. జలజీవన్ కింద ఇంటింటికి కొలాయి పథకం కింద మరో రూ. 500 కోట్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారు చేశారన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీ సభ్యుల గౌరవ వేతనం పెంచాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. 36 పనులను గ్రామాల్లో చేసుకునేలా ఈ నెల 23న గ్రామ సభలను పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానం చేయాలని నిర్ణయించి రూ. 2,000 కోట్లు విడుదల చేశారన్నారు. పంచాయతీలకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే నెరవేర్చుతున్నారని తెలిపారు. పంచాయతీల నిధులను రూ. 10,600 కోట్లు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దారి మళ్లించారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఉపాధి నిధులను దారి మళ్లాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధులు దారి మళ్లింపుపై ఎన్నో ఉద్యమాలు చేశామని వైవీబీ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.

# లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ముందుకు అడుగులు..



విజయవాడ, ఆగస్టు 21: నగరంలో బీజేపీ సభత్వ నమోదు కార్యక్రమం బుధవారం ఉదయం ప్రారంభమైంది. సభ్యత్వ నమోదుపై అవగాహన సమావేశాన్ని ఏపీ బీజేపీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమం అనేది మన బాధ్యత అని.. లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. దేశ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి బాధ్యత అందరి మీద ఉందన్నారు. పాశ్చాత్య ఆలోచన ధోరణికి స్వస్తి పలికేందుకు బీజేపీ ఆవిర్భావం అయ్యిందన్నారు. బీజేపీ ఆవిర్భావం నుంచి ఒక సిద్ధాంతంతో, కార్యకర్త బలంతో ముందుకు వెళ్తోందని చెప్పారు. 1984 లో పార్లమెంట్ సభల్లో ఇద్దరితో మొదలైన ప్రయాణం ప్రస్తుతం దేశ అభివృద్ధి కొరకు బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. భారతీయ సంస్కృతి విధి విధానాలతో బీజేపీ పని చేస్తుందన్నారు. మోదీ నాయకత్వంలో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సిద్ధాంతంతో ముందుకు వెళ్తోందన్నారు. ఈ సిద్ధాంతం అనేది మన లక్ష్యాన్ని చేరుకునే విధంగా ఉంటుందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో గెలవలేకపోయినా ఆయా రాష్ట్రాల అభివృద్ధి కొరకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కరోనా ఉన్న సమయంలో బీజేపీ కార్యకర్తలు ప్రజలకు దగ్గరగా ఉండి సేవని అందించారని గుర్తుచేశారు. కార్యకర్తలే బీజేపీకి బలమన్నారు. రాష్ట్రంలో 37 లక్షల వరకు సభ్యత్వం ఉన్నారన్నారు. మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అతి పెద్ద ఐదోవ ఆర్థిక శక్తిగా ఎదిగిందని వెల్లడించారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేయగలుగుతున్నామన్నారు. మూడో ఆర్థిక శక్తిగా ఉంటే ఇంకా ఎక్కువుగా పేదల కోసం పని చేస్తామని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో పాటు ఉత్తర్ ప్రదేశ్ మాజీ మంత్రి ప్రయాగ్ రాజ్, ఎమ్మెల్యే సిద్దార్ధ నాథ్ సింగ్, అరవింద్ మీనన్ (రాష్ట్ర బిజెపి సభ్యత్వ ఇంచార్జ్ ) మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, సోము వీర్రాజు, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సభ్యత్వ నమోదుపై క్యాడర్‌కు బీజేపీ కేంద్ర, రాష్ట్ర ముఖ్య నాయకులు దిశా నిర్దేశం చేశారు. మూడు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ చేస్తోంది. ఏపీలో బీజేపీ ఎమ్మెల్యేల గెలుపుతో సభత్వ నమోదుపై బీజేపీ అగ్రనాయకత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈ ఐదు సంవత్సరాలలో ఏపీలో పార్టీ బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు చేపట్టింది.




# ఈ 21 యూనివర్సిటీలు ఫేక్.. అవి ఇచ్చే డిగ్రీలు చెల్లవ్!

దిల్లీ: దేశ వ్యాప్తంగా 21 యూనివర్సిటీలు నకిలీవిగా ఉన్నట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇలాంటి వర్సిటీలు దిల్లీలో అత్యధికంగా ఎనిమిది ఉండగా.. యూపీలో నాలుగు, ఏపీ, బెంగాల్, కేరళలో రెండేసి, కర్ణాటక, మహారాష్ట్ర, పుదుచ్చేరిలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నట్టు తెలిపింది. గతేడాది దేశంలో 20 నకిలీ యూనివర్సిటీలు ఉండగా.. 2024 మే నాటికి వాటి సంఖ్య 21కి చేరింది. ఈ నకిలీ వర్సిటీలకు డిగ్రీలు ప్రదానం చేసే అధికారం లేదని గతంలోనే యూజీసీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. యూజీసీ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇలాంటి విశ్వవిద్యాలయాలు ప్రదానం చేసే డిగ్రీలను ఉన్నత విద్య, ఉద్యోగ ప్రయోజనాల కోసం గుర్తించబోమని.. ఆ డిగ్రీలు చెల్లుబాటు కావని UGC ఇప్పటికే తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులోని కాకుమానివారితోటలో క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీబీ విశాఖలోని బైబిల్ ఓపెన్ యూనివర్శిటీ ఆఫ్ ఇండియాను నకిలీవిగా యూజీసీ ప్రకటించింది. ఫేక్ యూనివర్సిటీల పూర్తి వివరాలతో కూడిన జాబితా కోసం క్లిక్ చేయండి. ఈ వర్సిటీల పట్ల అప్రమత్తంగా ఉండండి.

**దిల్లీలో ఫేక్ యూనివర్సిటీలు (8)..** ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్, కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్– దర్యాగంజ్
యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ, వొకేషనల్ యూనివర్సిటీ, ఏడీఆర్ – సెంట్రిక్ జ్యూరిడికల్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్, విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, ఆధ్యాత్మిక్ విశ్వవిద్యాలయ (ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం), ఉత్తరప్రదేశ్‌లో (4)
గాంధీ హిందీ విద్యాపీఠ్, ప్రయాగ్‌రాజ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూనివర్సిటీ (ఓపెన్ యూనివర్సిటీ), భారతీయ శిక్షా పరిషత్ , మహామయ టెక్నికల్ యూనివర్సిటీ
**పశ్చిమబెంగాల్‌లో(2)..** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చి
**కేరళలో (2)** సెయింట్ జాన్స్ యూనివర్సిటీ (కేరళ), ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రొఫెటిక్ మెడిసిన్, బదగాన్వి సర్కార్ వరల్డ్ ఓపెన్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ సొసైటీ (కర్ణాటక), రాజా అరబిక్ యూనివర్సిటీ (మహారాష్ట్ర), శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (పుదుచ్చేరి)




# అనాథ శవాలను అమ్మేసేవాడు.. ఆర్జీ కార్ మాజీ ప్రిన్సిపల్‌పై తీవ్ర ఆరోపణలు

కోల్‌కతాలో రెసిడెంట్ వైద్యురాలు హత్యాచారానికి గురైన ఆర్జీ కార్ మెడికల్ కళాశాల అవినీతి పుట్టగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అవినీతి అంతాఇంతా కాదని తెలుస్తోంది. చివరికి అనాథ శవాలను కూడా సందీప్ ఘోష్ విక్రయించేవాడని, బంగ్లాదేశ్‌కు అక్రమంగా ఔషధాలను ఎగుమతి చేసేవాడని మాజీ ఉద్యోగి పేర్కొన్నారు. వాడేసిన సిరంజులు, ఇతర సామగ్రిని కూడా రీసైక్లింగ్ చేసి సొమ్ము చేసుకొనేవాడని తెలిసింది. గతేడాది వరకు ఇదే కళాశాలలో పనిచేసి.. ప్రస్తుతం ముర్షిదాబాద్ డిప్యూటీ మెడికల్ కాలేజీ సుపరింటెండెంట్‌గా ఉన్న అక్తర్ అలీ పలు విషయాలపై ఈయనపై ఉన్నతాధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ ఆరోపణలపై ఏర్పాటైన సిట్ ఇటీవల అక్తర్‌ను విచారణకు పిలిపించింది. ఆయన ఫిర్యాదుల ఆధారంగా ఘోష్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. 2023 జులై 14న అలీ రాసిన లేఖ ప్రకారం.. ఆసుపత్రి ఆస్తులను కాలేజీ కౌన్సిల్ లేదా స్వాస్త్ భవన్ అనుమతులు లేకుండానే ఘోష్ లీజుకు ఇచ్చేవాడు. ఇక వైద్యశాలకు అవసరమైన పరికరాలు, ఔషధాల సరఫరాదారుల ఎంపికలో బంధుప్రీతి చూపించాడు. కోట్ల రూపాయల విలువైన కొటేషన్ల విషయంలో కుమ్మక్కై అనర్హులకు ఇచ్చాడు. ఇక సరఫరాదారుల నుంచి 20శాతం కమిషన్ పుచ్చుకొనేవాడని ఘోష్‌పై అలీ ఆరోపించాడు. దీంతోపాటు పరీక్షలు తప్పిన విద్యార్థుల నుంచి కూడా సొమ్ములు దండుకొనేవాడని ఆరోపణలున్నాయి. అనాథ శవాలు, వినియోగించిన సిరంజ్‌లు, సెలైన్ బాటిల్స్, రబ్బర్ గ్లౌజులు వంటివి ఆసుపత్రిలో ప్రతీ రెండ్రోజులకు 500–600 కిలోలు పోగయ్యేవి.

వాటిని ఇద్దరు బంగ్లాదేశీవాసుల సాయంతో ఘోష్ రీసైక్లింగ్ చేయించేవాడు. వీటిపై అలీ అప్పట్లోనే విజిలెన్స్ కమిషన్, ఏసీబీ, హెల్త్ డిపార్ట్‌మెంట్లకు ఫిర్యాదు చేశాడు. అప్పట్లో ఆయనపై వేసిన ఎంక్వైరీ కమిటీలో తాను కూడా సభ్యుడినని, అతడు దోషిగా తేలినా ఎవరూ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నాడు.

**సిజేరియన్ చేయించుకొన్న భార్యపై దాడి..** ఇక సందీప్ ఘోష్ తరచూ భార్యపై అమానవీయంగా దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఆమె సిజేరియన్ చేయించుకొని బిడ్డకు జన్మనిచ్చిన 14 రోజుల తర్వాత ఘోష్ తీవ్రంగా ఆమెపై దాడి చేసినట్లు ఇరుగు పొరుగువారు చెబుతున్నారు. ఈ ఘటనలో ఆమెకు కుట్లు పగిలి తీవ్ర రక్తస్రావమైనట్లు పేర్కొన్నారు. తొలుత అది వారి కుటుంబ విషయమని పట్టించుకోని స్థానికులు.. ఆమె పరిస్థితి చూసి జోక్యం చేసుకొన్నారు. వీధి మొత్తం ఏకమై ఆందోళనకు దిగినట్లు స్థానికులు చెప్పారు. చుట్టుపక్కల వారితో కూడా అతడు సక్రమంగా ప్రవర్తించేవాడు కాదని పేరుంది.

# విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ జగన్ మరోసారి పిటిషన్



అమరావతి/హైదరాబాద్ 21: విదేశాలు వెళ్లేందుకు అనుమతి కోరుతూ నాంపల్లి సీబీఐ కోర్టులో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిటిషన్ వేశారు. 20 రోజుల పాటు కుటుంబంతో కలిసి లండన్, యూకే వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని జగన్ కోరారు. లండన్‌లో ఉన్న కూతురుని చూడటానికి వెళ్లాలని, అనుమతి ఇవ్వాలని జగన్ తరపు న్యాయవాది వాదన వినిపించారు. ఈ ఏడాదిలో రెండో సారి విదేశీ పర్యటనకు ఎమ్మెల్యే అనుమతి కోరారు. ఏపీ ఎన్నికలు పూర్తి అయిన తరువాత 15 రోజులు పాటు జగన్ విదేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే. తిరిగి ఇప్పుడు మరోసారి విదేశాలకు వెళ్లేందుకు జగన్ అనుమతి కోరగా... అనుమతి ఇవ్వదంటూ సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణ వేగవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వద్దని సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌కు సంబంధించి ఇరువురి వాదనలు పూర్తి అవగా.. తీర్పును ఈనెల 27న వెల్లడిస్తామన్న సీబీఐ కోర్టు తెలిపింది. అలాగే ఎంపీ విజయసాయిరెడ్డి విదేశీ పర్యటన పిటిషన్‌పై ఈనెల 30న సీబీఐ కోర్టు తీర్పు వెల్లడించనుంది.

# జగన్ విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దు: కోర్టును కోరిన సీబీఐ

హైదరాబాద్: బ్రిటన్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలన్న వైకాపా అధ్యక్షుడు, అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడు జగన్ పిటిషన్‌పై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఆయన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని కోర్టును సీబీఐ కోరింది. జగన్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి.

కోర్టు తన నిర్ణయాన్ని ఈ నెల 27కు వాయిదా వేసింది. యూకేలో చదువుతున్న కుమార్తె వద్దకు సెప్టెంబరు మొదటి వారంలో వెళ్లడానికి అనుమతించాలని పిటిషన్‌లో జగన్ కోరారు.

ఈ పిటిషన్‌ను పరిశీలించిన సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం సీబీఐ వివరణ కోరుతూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు. దీంతో సీబీఐ నేడు వాదనలు వినిపిస్తూ జగన్ బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని కోర్టును కోరింది.

# నిఘా నేత్రంతో నేరాలకు అడ్డుకట్ట: హోం మంత్రి అనిత



అమరావతి: గత ప్రభుత్వం సీసీ కెమెరాల బిల్లులు కూడా చెల్లించలేదని హోంమంత్రి అనిత విమర్శించారు. హోంశాఖపై బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అనంతరం హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ.. సమావేశం వివరాలను వెల్లడించారు. "వైకాపా హయాంలో సీసీ కెమెరాల నిర్వహణ కూడా సరిగాలేదు. మహిళల భద్రత గురించి వైకాపా నేతలు మాట్లాడటం హస్యాస్పదం. గతంలో దాదాపు 15వేల సీసీ కెమెరాలు ఉంటే వాటిలో కొన్ని పనిచేయట్లేదు.. మరికొన్ని కొత్తవి కావాలి. చాలా చోట్ల సీసీ కెమెరాలు లేక నేరాలు జరుగుతున్నాయి. రద్దీగా ఉండే ప్రదేశాలు, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. నేరస్థులు తప్పించుకోకుండా చూడాలనేదే ముఖ్య ఉద్దేశం. పెండింగ్ బిల్లులు రూ. 11 కోట్లు క్లియర్ చేయాలని సీఎం ఆదేశించారు. పోలీసు శాఖలో కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు అనుమతించారు" అని హోం మంత్రి తెలిపారు.

## ఆ నవ్వులోనే ఉందా ఆ బ్యూటీలో కిక్!

కెరీర్ ప్రారంభించి రెండు దశాబ్ధాలకు చేరువలో ఉన్నా చింద్రాగదా సింగ్ ఇంకా నత్తకనడనే సాగుతోంది. బాలీవుడ్ లో సినిమాలు చేస్తోంది అంటే చేస్తోంది అనుకోవడం తప్ప అమ్మడి పేరు ఇంతవరకూ మార్మోగింది లేదు. గ్యాప్ లేకుండా ఏడాదికి ఒక సినిమా చేస్తున్నా? చిత్ర సౌండింగ్ మాత్రం ఎప్పుడూ మిస్సింగ్ గా అనిపిస్తుంది. గత ఏడాది 'గ్యాస్ లైట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అది ఫ్లాప్ అయింది. ఏడాది అనంతరం ఇటీవలే 'ఖేల్ ఖేల్ మే'తోనూ అలరించే ప్రయత్నం చేసింది. అది కూడా ఫ్లాప్ చిత్రంగానే మిగిలి పోయింది. ఇలా అమ్మడి కెరీర్ సోసోగా సాగుతోంది. మరి కొత్త ప్రాజెక్ట్ గురించి చెప్పడానికి ఎంత సమయం పడుతుందో చూడాలి. ఇక సోషల్ మీడియాలో కూడా చాలా రేర్ గానే ఫోటోలు పోస్ట్ చేస్తుంది. ఇన్ స్టా మీద ఆసక్తి తగ్గిందో? ఎందుకొచ్చిన తలబొప్పి



అని సైలెంట్ అయిందో ఈ మధ్య కాలంలో అయితే అమ్మడు ఏమాత్రం యాక్టివ్ గా కనిపించలేదు. తాజాగా చాలా గ్యాప్ తర్వాత అమ్మడు వింటేజ్ గ్లామ్ అంటూ ఓ హాట్ ఫోటోతో నెటి జనుల ముందు కొచ్చింది. ఇదిగో ఇక్కడిలా వైట్ కలర్ ఔట్ ఫిట్ లో అమ్మడు బిగుసుకుపోయింది. క్లేవేజీ బ్యూటీని హైలైట్ చేస్తూ అగ్గిరాజేసింది. ఐబ్రోస్...మ్యాకప్...పెదాలకు పూసిన లిప్ స్టిక్ అన్ని ఓవర్ గానే ప్రొజెక్ట్ అవుతు న్నాయి. డ్రెస్ మ్యాచింగ్ చెవులకు దిద్దులు..యాక్సరీస్ ప్రతీది అమ్మడి అందాన్ని మరింత హైలైట్ చేసాయి.

ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. సొసగరి బ్యూటీకి యువత ఫిదా అవుతుంది. లుక్స్ గార్జియస్..బ్యూటీఫుల్ లేడీ అంటూ పొగిడేస్తున్నారు. లవ్ సింబల్స్ పోస్ట్ చేసి ప్రపోజల్స్ వర్షం కురిపిస్తున్నారు. చిత్రపై ఎటాకింగ్ అంటే? ఎప్పుడూ ఇలాగే ఉంటుందని మరోసారి ప్రూవ్ చేస్తున్నారు.

## క్లోజప్ లో రాయ్ బికినీ షో

20 ఏళ్ల క్రితం కాంచన మాల కేబుల్ టీవీ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ లక్ష్మి రాయ్. కాల క్రమేనా ఈ అమ్మడు తన పేరును రాయ్ లక్ష్మి గా మార్చుకుంది. కెరీర్ ఆరంభం నుంచి కూడా పెద్ద హిట్స్, బ్లాక్ బస్టర్ సినిమాల్లో ఈ అమ్మడు నటించలేదు. అడపా దడపా వస్తున్న ఆఫర్లు సద్వినియోగం చేసుకుంటూ, అందాల ఆరబోత చేస్తూ రాయ్ లక్ష్మి ఈ ఇరవై ఏళ్ల సినీ కెరీర్ ను కొనసాగించింది. అందాల విషయంలో ఈ అమ్మడు గతంలో కంటే ఇప్పుడే బాగుంది, అప్పటికంటే ఇప్పుడే ఇంకాస్త అందంగా కనిపిస్తుందని కూడా కొందరు అంటూ ఉన్నారు. ఈ మధ్య



కాలంలో బాలీవుడ్ లో కూడా సందడి చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఆ స్థాయి లో అందాల ప్రదర్శన చేస్తూ నెటిజన్స్ ని ఆకట్టుకుంటూ ఉంది. రెగ్యులర్ గా బికినీ షో చేసే ఈ అమ్మడు మరోసారి క్లోజప్ లో తన బికినీ అందాలను చూపించి అందరి దృష్టిని ఆకర్షించింది. బీచ్ లో సరదాగా చిల్ అవుతున్న రాయ్ లక్ష్మి బికినీ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ స్థాయిలో అందంగా ఉండటం వల్లే ఈ వయసులో కూడా బాలీవుడ్ లో ఆఫర్లను సొంతం చేసుకుంటుంది అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరో పదేళ్ల పాటు రాయ్ లక్ష్మి అందాల విందు, జోరు కొనసాగడం ఖాయం అంటూ సినీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాయ్ లక్ష్మి ఒక తమిళ సినిమాతో పాటు హిందీ సినిమాలో నటించేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం అందుతోంది.




## సింహం కూడా సంక్రాంతికి ఫిక్సైందా..?



నందమూరి నట సింహం బాలకృష్ణ తన 109వ సినిమాగా కె ఎస్ రవీంద్ర అలియాస్ బాబీ డైరెక్షన్ లో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ కలిసి తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రద్ధ శ్రీనాథ్, ఊర్వశి రౌతేలా ఫిమేల్ లీడ్ గా నటిస్తున్నారు. వరుస సినిమాలు వాటితో వరుస హిట్లతో అదరగొట్టేస్తున్న బాలయ్య బాబు బాబీ సినిమాతో కూడా భారీ హిట్ టార్గెట్ పెట్టుకున్నట్టు తెలుస్తుంది. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చినట్టు టాక్. అక్టోబర్ కల్లా సినిమా పూర్తి చేసి డిసెంబర్ లో రిలీజ్ చేయాలని మేకర్స్ అనుకుంటున్నారు. ఐతే డిసెంబర్ లో పుష్ప 2, గేమ్ చేంజర్ సినిమాలు ఉన్నాయి కాబట్టి రిలీజ్ కష్టమని భావిస్తున్నారు. ఐతే నిర్మాతలు ఇప్పుడు బాలయ్య బాబు సినిమాను సంక్రాంతికి రిలీజ్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. బాలకృష్ణ సినిమా సంక్రాంతికి రిలీజైతే ఆ లెక్క వేరేలా ఉంటుంది. సంక్రాంతికి నందమూరి హీరో సినిమా వస్తే ఫ్యాన్స్ కి పండుగే. సంక్రాంతికి వచ్చిన బాలయ్య సినిమాలకు మంచి హిట్ రికార్డ్ ఉంది. అందుకే బాలయ్య 109వ సినిమాను కూడా సంక్రాంతి రేసులో దించాలని చూస్తున్నారు. ఐతే సంక్రాంతికి ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర సినిమా రిలీజ్ లాక్ చేశారు. వెంకటేష్ అనీల్ రావిపుడి సినిమా కూడా సంక్రాంతికి రావడం కన్ఫర్మ్ అయ్యింది. ఇక ఇప్పుడు బాలయ్య బాబు మూవీ కూడా పొంగల్ కి రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. సీనియర్ హీరోల సినిమాల ఫైట్ తో బాక్సాఫీస్ కళకళలాడుతుందని చెప్పొచ్చు. ఐతే ఇదివరకు కూడా బాలయ్య, వెంకటేష్, చిరంజీవి ముగ్గురు కలిసి బాక్సాఫీస్ ఫైట్ లో పాల్గొన్న సందర్భాలు ఉన్నాయి. అప్పుడు బాలకృష్ణ సినిమా సక్సెస్ అందుకుంది. ఐతే ఈ ముగ్గురితో పాటు నాగార్జున కూడా ఏదైనా సినిమా తో వస్తే సంక్రాంతి ఫెస్టివల్ సీనియర్లకు ఇచ్చేసినట్టు అవుతుంది. మరి సంక్రాంతికి రిలీజ్ అనౌన్స్ మెంట్ అయితే చేస్తారు రిలీజ్ టైం కు ఏవి ఉంటాయి. ఏవి వాయిదా పడతాయన్నది తెలియాల్సి ఉంది. అయితే వచ్చే సంక్రాంతికి మాత్రం సీనియర్ స్టార్ సినిమాలతో ఒక రేంజ్ లో హంగామా ఉండదనుందని చెప్పొచ్చు. సీనియర్ స్టార్ బాక్సాఫీస్ ఫైట్ తో సంక్రాంతికి సినిమాల సందడి షురూ కానుంది. మరి వీరిలో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

## దళపతి గోట్ సైలెన్స్ కి రీజన్ ఏంటి..?



కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ సినిమా రిలీజ్ అంటే ఆ హీరో ఫ్యాన్స్ చేసే హంగామా ఒక రేంజ్ లో ఉంటుంది. తమిళ్ లో నెంబర్ 1 స్టార్ గా తిరుగులేని క్రేజ్ తెచ్చుకున్న విజయ్ ఆ ఇమేజ్ కి తగినట్టుగానే సినిమా సక్సెస్ లు అందుకుంటున్నాడు. దళపతి విజయ్ సినిమా అంటే చాలు ఫ్యాన్స్ కి పూనకాలు వచ్చేస్తాయి. ప్రస్తుతం విజయ్ వెంకట్ ప్రభు కాంబినేషన్ లో వస్తున్న సినిమా జి.ఓ.ఏ.టి. సినిమాలో విజయ్ డ్యుయల్ రోల్ లో నటిస్తున్నారని తెలిసిందే. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో త్రిష కూడా ఇంపార్టెంట్ రోల్ లో ఛాన్స్ దక్కించుకుంది. సెప్టెంబర్ 5న రిలీజ్ లాక్ చేసుకున్న ఈ సినిమా విషయంలో మేకర్స్ అంతా కూడా చాలా సైలెంట్ గా ఉన్నారు. సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ వదిలిన చిత్ర యూనిట్ లేటెస్ట్ గా సాంగ్ ని వదిలారు. దళపతి గోట్ సినిమా మరోసారి ఫ్యాన్స్ తో పాటుగా ఆడియన్స్ కు మంచి మాస్ ట్రీట్ అందిస్తుందని అంటున్నారు. ఐతే సినిమా గురించి ఎక్కువగా రివీల్ చేసి ఆ తర్వాత అంచనాలను అందుకోలేదని అనుకోవడం కన్నా సినిమా గురించి ఎలాంటి క్లూస్ ఇవ్వకుండా థియేటర్ లో ప్రేక్షకులు సర్ ప్రైజ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారట. అందుకే దళపతి గోట్ గురించి ఎక్కువగా డిస్కషన్స్ జరగట్లేదని అంటున్నారు. ఇక ఒక సినిమా పూర్తి చేసే వరకు మరో సినిమా గురించి ఆలోచించని విజయ్, గోట్ రిలీజ్ తర్వాత తన నెక్స్ట్ ప్లానింగ్ ఏంటన్నది చెప్పాలని చూస్తున్నారు. విజయ్ గోట్ తెలుగులో కూడా భారీ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు.

ఐతే తెలుగులో ఈసారైనా విజయ్ వచ్చి ప్రమోషన్స్ చేస్తాడా లేదా అని తెలుగు ఆడియన్స్ డౌట్ పడుతున్నారు. విజయ్ గోట్ సినిమాకు యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్నారు. ఇటీవలే యువన్ శంకర్ రాజా విశ్వక్ సేన్ నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాకు మ్యూజిక్ అందించారు. విజయ్ గోట్ సినిమాకు మ్యూజిక్ పరంగా కూడా యువన్ తన మార్క్ మ్యూజిక్ తో అందించారని తెలుస్తుంది. మరి గ్రేటెస్ట్ ఆల్ ది టైం గా విజయ్ తన సత్తా చాటుతారా లేదా అన్నది చూడాలి.

## అవికా గోర్.. అల్ట్రా గ్లామర్ మామూలుగా లేదు

చిన్నారి పెళ్లికూతురు సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకి సుపరిచితం అయిన బ్యూటీ అవికా గోర్. ఈ అమ్మడు ఉయ్యాల జంపాల సినిమాతో హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. మొదటి సినిమానే సూపర్ హిట్ అయ్యింది. తరువాత నాగ శౌర్యకి జోడీగా లక్ష్మి రావే మా ఇంటికి మూవీ చేసింది. ఈ సినిమా ఎవరేజ్ టాక్ తెచ్చుకుంది. మళ్ళీ రాజ్ తరుణ్ తో సినిమా చూపిస్త మావ మూవీలో నటించింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. అక్కడి నుంచిఅ అవికా గోర్ కి అవకాశాలు పెరిగాయి. తెలుగుతో పాటు కన్నడ, హిందీ భాషలలో కూడా అవికా గోర్ అవకాశాలు అందుకుంది. నిఖిల్ కి జోడీగా ఎక్కడికి పోతావు చిన్నవాడా మూవీతో మరో హిట్ ని అవికా గోర్ తన ఖాతాలో వేసుకుంది. తరువాత తెలుగుకి కొంత గ్యాప్ ఇచ్చింది. మరల స్లిమ్ అయ్యి రాజుగారి గది2తో సూపర్



హిట్ అందుకుంది. ఆ తరువాత అవికా గోర్ చేసిన సినిమాలు ఏవీ కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. చివరిగా తెలుగులో ఉమాపతి అనే సినిమాలో అవికా గోర్ కనిపించింది. హిందీలో బ్లడీ ఇష్క్ అనే మూవీతో రీసెంట్ గా అవికా గోర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. హర్రర్ జోనర్ లో తెరకెక్కిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. అయితే బాలీవుడ్ లోనే ప్రస్తుతం అవికా గోర్ అవకాశాల కోసం ప్రయత్నం చేస్తోంది. దీనికోసం తనని తాను గ్లామర్ గా షోకేస్ చేసుకుంటుంది. రెగ్యులర్ గా హాట్ ఫోటోషూట్ లని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తోంది. తాజాగా మరోసారి అదిరిపోయే అందంతో మెస్మరైజ్ చేసే లుక్స్ తో హాట్ ఫోటోలని అవికా గోర్ ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంది. లాంగ్ ఫ్రాక్ లో స్టైలిష్ గా ఫోజులిస్తూ తనలో ఉన్న యాటిట్యూడ్ ని ఈ ఫొటోలతో ఎలివేట్ చేస్తోంది. ఈ ఫోటోలకి అవికా గోర్ ఇంటరెస్టింగ్ కామెంట్ కూడా జోడించింది. గుండెలు బద్దలయ్యే విషయం ఒకటైతే. ఇందులో నా ఇగో ఇంకోటి కూడా ఉందంటూ పేర్కొంది. ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు నుంచి అవికా గోర్ యాటిట్యూడ్ పిక్స్ పై అదిరిపోయే కామెంట్స్ వస్తున్నాయి.

## అందాల మెరుపులు కురిపిస్తున్న జాన్వీ

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్ లో అడుగు పెట్టి చాలా కాలం అయ్యింది. జాన్వీకి వరుస ఆఫర్లు దక్కుతున్నాయి కానీ హీరోయిన్ గా మాత్రం ఇప్పటి వరకు కమర్షియల్ సక్సెస్ దక్కలేదు. కమర్షియల్ హీరోయిన్ గా నటించడంతో పాటు, లేడీ ఓరియంటెడ్ సినిమాలను కూడా ఈ అమ్మడు చేసింది. జాన్వీ కపూర్ ప్రస్తుతం టాలీవుడ్ లో ఎన్టీఆర్ కు జోడీగా దేవర సినిమా ను చేస్తుంది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా రెండు పార్ట్ ల్లో రాబోతుంది. ఆ రెండు పార్ట్ ల్లో కూడా జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తూ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. మరో వైపు రామ్ చరణ్ కి కూడా జోడీగా ఈ అమ్మడు నటించేందుకు రెడీ అవుతుంది. ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు దర్శకత్వం లో ఈ సినిమా రూపొందుతుంది. మొదటి సినిమా ఉప్పెన తో కృతి శెట్టికి స్టార్



ఇమేజ్ ను తెచ్చి పెట్టిన బుచ్చి బాబు కచ్చితంగా జాన్వీ కపూర్ ను ప్రేక్షకులు కోరుకునే విధంగా అందంగా చూపించడం ఖాయం. సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ సందడి కొనసాగుతూనే ఉంది. అందాల ఆరబోత ఫోటోలతో నెటిజన్స్ ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ మరోసారి క్లీవేజ్ షో అందాలతో మతి పోగొడుతోంది. నడుము అందాలను చూపిస్తూ, కసిగా చూస్తున్న జాన్వీ కపూర్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అతిలోక సుందరి శ్రీదేవి కి అసలైన వారసురాలు జాన్వీ కపూర్ అంటూ ఫ్యాన్స్ ఈ ఫోటోలను చూస్తూ తెగ మురిసిపోతున్నారు. ముందు ముందు టాలీవుడ్, బాలీవుడ్ తో పాటు అన్ని భాషల్లో కూడా జాన్వీ కపూర్ మంచి గుర్తింపును దక్కించుకుని పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ గా నిలుస్తుందని ఫ్యాన్స్ అంటున్నారు.




హైదరాబాద్: జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధుల గురించి చెప్పాలని ఏఏజీకి ఉన్నత న్యాయస్థానం సూచించింది.

ఈక్రమంలో హైడ్రా స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని ఏఏజీ పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నించింది. స్థల యజమానులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారని తెలిపింది. స్థానిక సంస్థల అనుమతితో నిర్మాణాలు జరుగుతాయని పేర్కొంది. 15-20 ఏళ్ల తర్వాత హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమంటూ కూల్చివేయడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. మరోవైపు చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటైందని ఏఏజీ తెలిపారు.

ప్రదీప్‌రెడ్డి వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. జన్వాడలో ఉన్న ఫాంహౌస్ జీవో 111లోకి వస్తుందని పేర్కొన్నారు. జీవో 111 పరిధిలోని భూములు, ఫాంహౌజ్‌లు నీటిపారుదల శాఖ చూస్తోందని వివరించారు. వీటిని కూల్చివేసే హక్కు హైడ్రాకు లేదని ఏఏజీ తెలిపారు. కూల్చివేతల గురించి చర్చించాల్సి ఉందని హైకోర్టు తెలిపింది. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది.

# తప్పుంటే.. దగ్గరుండి ఫామ్ హౌస్ కూలగొట్టిస్తా



హైదరాబాద్, ఆగస్ట్ 21: జన్వాడ ఫామ్ హౌస్ కూల్చివేస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో స్పందించారు. తన పేరుతో ఫామ్ హౌస్ లేదని ఆయన స్పష్టం చేశారు. తన మిత్రుడికి చెందిన ఫామ్ హౌస్‌ను తాను లీజుకు తీసుకున్నానని తెలిపారు. గత కొన్ని నెలలుగా తాను అక్కడే నివసిస్తున్నట్లు చెప్పారు. జన్వాడలోని ఈ ఫామ్ హౌస్ నిబంధనల ప్రకారం లేకుంటే తానే దగ్గరుండి కూలగొట్టిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎఫ్ టీ ఎల్ పరిధిలో ఈ ఫామ్ హౌస్ నిర్మించి ఉంటే.. దానిని కూల్చివేస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని కుండ బద్దలు కొట్టారు.

**కాంగ్రెస్ పార్టీలో మంత్రులు, సీనియర్ నేతల పరిస్థితి ఏమిటి..?** కాంగ్రెస్ పార్టీ మంత్రులు, సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కెవిపి రామచంద్రరావు, మహేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ తదితరులకు ఫామ్ హౌస్‌లున్నాయన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ ఎక్కడ ఉందో కూడా తాను చూపిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫామ్ హౌస్.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలా ఉందని కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. పొంగులేటి సోదరుడు ప్రస్తుతం అదే ఫామ్ హౌస్‌లో ఉంటున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.. తన ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మించారా? అంటూ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు.

**మంత్రులు ఫామ్ హౌస్‌ల కూల్చివేతతో ప్రారంభించాలి..** ముందు మంత్రుల ఫామ్ హౌస్‌ల కూల్చివేతతోనే వీటిని ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాషపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తమ పార్టీ బీఆర్ఎస్.. భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదని.. భారత రైతు సమితి అని కూడా ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే రైతులకు పూర్తిగా రుణమాఫీ జరగలేదని కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు.

**హైకోర్టులో పిటిషన్ దాఖలు..** మరోవైపు జన్వాడలో ఫామ్ హౌస్ కూల్చవద్దంటూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. బీఆర్ఎస్ నేత ప్రదీప్ రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని కట్టడాలపై హైడ్రా గత కొన్ని రోజులుగా కొరడా ఝుళిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జన్వాడలోని ఫామ్ హౌస్.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండడంతో.. దీనిని కూల్చివేస్తారంటూ ఓ ప్రచారం అయితే సాగుతుంది. అలాంటి వేళ హైకోర్టులో ప్రదీప్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా తెలంగాణ ప్రభుత్వం, హైడా కమిషనర్ రంగనాథ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శంకర్‌పల్లి రెవెన్యూ అధికారి, చీఫ్ ఇంజినీర్ తదితరులను పిటిషనర్ చేర్చారు.


# రైతు రుణమాఫీని రేవంత్ గందరగోళంగా మార్చేశారు..



హైదరాబాద్: ఇవాళ్టి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు ఉత్సవ్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టనుంది. దీనిలో భాగంగానే సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్ లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి విజయ రహత్కర్ హాజరవగా.. అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక్క గ్రామంలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై సైతం కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పద్ధతిలోనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలకు సీఎం రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారన్నారు. రైతు రుణమాఫీని రేవంత్ రెడ్డి గందరగోళంగా మార్చారని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. దేవుళ్ళపై ఒట్లు వేసిన సీరేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం రుణమాఫీ కూడా పూర్తి కాలేదని కిషన్ రెడ్డి తెలిపారు. రుణమాఫీపై పూర్తి వివరాలను ప్రజలు ముందు ప్రభుత్వం ఉంచాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం అవుతున్నామన్నారు. బీజేపీ.. వ్యక్తులు, కుటుంబాల కోసం నడిచే పార్టీ కాదని.. పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావటమే బీజేపీ లక్ష్యమన్నారు. బీజేపీ అధికారికంలోకి రావాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

సెప్టెంబర్ 17ను తెలంగాణ ముక్తి దివస్ ను ఘనంగా నిర్వహిస్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో సభ్యత నమోదులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుటుంబాల కోసం అవినీతికి పాల్పడుతున్న పార్టీలను తరిమికొడతామన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీని మించిన ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.

# రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు: మంత్రి తుమ్మల



ఖమ్మం: రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో ఉన్నా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేశామని చెప్పారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులున్న వారికి మాత్రమే రుణమాఫీ ఆగిందన్నారు. వాటిని సరిదిద్ది రుణమాఫీ చేయాలని అధికారులను ఆశించామని చెప్పారు. రుణమాఫీ పొందలేని రైతులు.. వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలు, మండల ఆఫీసుల్లో అధికారులను పెట్టి వివరాలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని, పదేళ్ల పాటు రైతుల్ని మోసం చేసిన పార్టీ మొసలి కన్నీరు కారుస్తోంది. నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీ కూడా మాట్లాడుతోంది. అసత్యాలు చెప్పి రైతుల్లో ఆందోళన పెంచాలని చూస్తున్నారు. రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

బ్యాంకులు, అధికారులు ఏమైనా తప్పు చేస్తే.. వాటిని సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతోంది. 41,78,892 మంది రైతులు రుణాలు తీసుకున్నారని బ్యాంకులు చెప్పాయి. వారి బకాయిలు రూ.31వేల కోట్లు ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువగా రూ.2లక్షలలోపు రుణాలే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ పనులు చూసుకోవాలి" అని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# ఫిర్యాదుల వరద.. నాగార్జునకు షాక్ తప్పదా..!?

హైదరాబాద్, ఆగస్టు 21: పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా వింగ్ దూకుడుగా వ్యవహరిస్తోంది. అక్రమ కట్టడాలను గుర్తించి వెంటనే కూల్చివేస్తోంది. గండిపేట పరిధిలోని ఆక్రమణలపై దృష్టి సారించిన హైడ్రా.. అక్కడి అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసేస్తోంది. ఈ క్రమంలోనే.. టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌పై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తమ్మిడి చెరువులో 3 ఎకరాల 30 గుంటలను ఆక్రమించి ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదు చేశారు పలువురు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేయాలని హైడ్రా కమిషనర్‌కు జనం కోసం అనే సంస్థ ఫిర్యాదు చేసింది. హైటెక్ సిటీ ప్రాంతంలో ఖానామెట్ రెవెన్యూ పరిధిలో 29 ఎకరాల 24 గుంటలకు పైగా విస్తరించి ఉన్న తమ్మిడి చెరువును కొందరి వ్యాపార ప్రయోజనాల కోసం ఆక్రమణకు గురైంది. శిల్పారామం, శిల్ప కళావేదికలతో పాటు అనేకం ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేసినా.. వాటి ఎదురుగా ఉన్న తమ్మిడి చెరువుపై 'దాదాపు 3 ఎకరాల 30 గుంటల చెరువును చెరబట్టి హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను నిర్మించారు. దీనిపై మా 'జనం కోసం' అనేక ఫిర్యాదులు చేసింది. లోకాయుక్త కంప్లైంట్ నెంబర్ 2815/2012/%దీ%1గా స్వీకరించి అధికారులకు అనేకమార్లు హెచ్చరికలు జారీ చేయగా.. 14-07-2014 ప్రాంతంలో చర్యలకు ఉపక్రమించినట్లు డ్రామాలాడి మిన్నకుండి పోయారు. ప్రభుత్వ పెద్దల 'మిలాఖత్' ఈ చెరువుపై చర్యలు తీసుకోకపోవడానికి కారణంగా కనిపిస్తోంది. మా 'జనం కోసం' సర్వే నెంబర్ 36, 37, 38/పి. 11/2, 11/36, 68/పి, 41/పి లకు చెందిన 29 ఎకరాల 24 గుంటల చెరువు, ప్రభుత్వ భూమి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లపై ఉన్న కబ్జాలను తొలగించి.. 'తమ్మిడి చెరువు'ను పునరుద్ధరించాలని అనేక ఫిర్యాదులు చేశాం.' అని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదును అందజేశారు.




సాధారణంగా వాతావరణం అనుకూలించకపోవడం, ఇతరత్రా భద్రతా కారణాలతో విమాన సర్వీసులు రద్దవడమో లేదా ఆలస్యమవడమో చూస్తుంటాం. జపాన్‌లోని అత్యంత రద్దీగా ఉండే న్యూ చిటోస్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఇటీవల వందల సంఖ్యలో విమాన సర్వీసులకు ఆటంకం ఏర్పడింది. మరి దీనికి కారణమేంటో తెలుసా?.. 'ఓ కత్తెర కన్పించపోవడమే..!' ఇది తెలుసుకొని ప్రయాణికులు అవాక్కయ్యారు. ఇంతకీ ఏం జరిగిందేంటంటే..? జపాన్‌లోని హక్కైడో ద్వీపంలో గల న్యూ చిటోస్ ఎయిర్‌పోర్ట్‌లో గత శనివారం (ఆగస్టు 17) ఓ రిటైల్ స్టోర్ నుంచి కత్తెర కన్పించకుండా పోయింది. ఈవిషయాన్ని విమానాశ్రయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికుల భద్రతా తనిఖీలను ఆపి మరి.. దాదాపు రెండు గంటల పాటు దానికోసం క్షుణ్ణంగా వెతికారు.

దీని కారణంగా 36 విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. మరో 201 విమాన సర్వీసులు ఆలస్యమయ్యాయి.

**అసలు ట్విస్ట్ అదే..** దీనిపై ఎయిర్‌పోర్టు అధికారులు స్పందిస్తూ.. భద్రతాపరమైన చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. "ఎవరైనా ఉగ్రవాది ఆ కత్తెరను దొంగలించి దాన్ని ఆయుధంగా చేసుకొనే అవకాశం ఉంది. అందుకే ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నాం" అని పేర్కొన్నారు. అయితే, అసలు ట్విస్ట్ ఏంటంటే.. చివరకు ఆ కత్తెర కన్పించకుండా పోయిన దుకాణంలోనే దొరికిందట..! ఆ స్టోర్‌లో మేనేజ్‌మెంట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఏదేమైనా ఈ ఘటన కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానాలు ఆలస్యం కావడంతో వారు గంటలతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. కొందరైతే చేసేదేం లేక తిరిగెళ్లిపోయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని జపాన్ రవాణా మంత్రిత్వశాఖ ఎయిర్‌పోర్టు అధికారులను ఆదేశించింది. 1988లో ప్రారంభించిన ఈ న్యూ చిటోస్ ఎయిర్‌పోర్ట్.. హక్కైడోలో అతిపెద్దది. జపాన్‌లోని అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఇది ఒకటి. ఇక్కడ భద్రతాపరమైన ప్రొటోకాల్స్ కఠినంగా ఉంటాయని దీనికి పేరుంది.

# టూరిజం ప్లేస్‌గా నేలకొండపల్లి అభివృద్ధే లక్ష్యం..



ఖమ్మం జిల్లా, ఆగస్టు 21: జిల్లాలోని నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్త రామదాస ధ్యాన మందిర ఆడిటోరియాన్ని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. భక్తరామదాసు ఇక్కడే జన్మించారని.. ఆయన జన్మస్థలాన్ని యావత్ ప్రపంచానికి తెలియజేయాలని అన్నారు. ఆడిటోరియం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మూడు కోట్ల రూపాయలతో ఆడిటోరియం నిర్మాణం చేసినట్లు చెప్పారు. ఇక్కడ ప్రశాంతత కనిపిస్తుందని.. బౌద్ధ స్థూపాన్ని పరిశీలించామన్నారు. ప్రపంచంలో మూడో అత్యంత పెద్ద బౌద్ధ స్తూపం నేలకొండపల్లిలో ఉందని తెలిపారు. నేలకొండపల్లిని టూరిజం ప్లేస్‌గా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు భక్తరామదాసు గురించి తెలియజేలన్నదే ఇక్కడి వారి లక్ష్యమన్నారు. ధ్యాన మందిరం ఎలా అభివృద్ధి చేయాలో నిపుణులతో చర్చిస్తామన్నారు. భక్తరామదాసు ప్రజల శ్రేయస్సు కోసం పని చేశారన్నారు. మార్పు రావాలని తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామన్నారు. శ్రీరామచంద్రునికి ఆలయం కట్టేందుకు భక్తరామదాసు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తెలుసన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇందిరమ్మ రాజ్యం పేదోళ్ల రాజ్యమని అన్నారు. భక్తరామదాసు ఈ ప్రభుత్వానికి ఆదర్శమని చెప్పుకొచ్చారు. ప్రజలకు చెప్పిన ప్రతి మాటను నెరవేరుస్తామని... అభివృద్ధి సంక్షేమం రెండూ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 21: నగరంలో ఆపరేషన్ హైడ్రా కొనసాగుతూనే ఉంది. అక్రమనిర్మాణాలే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చెలరేగిపోతోంది. ఎల్‌టీఎఫ్ పరిధిలో ఉన్న నిర్మాణలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. ఈ క్రమంలో జన్వాడ ఫాంహౌస్ ఎఫ్ టీ ఎల్ పరిధిలో ఉండడంతో తమ కట్టడాలను హైడ్రా కూల్చే అవకాశం ఉందని ముందస్తుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. జన్వాడ ఫాంహౌస్‌ను కూల్చవద్దంటూ బీఆర్ఎస్ నేత ప్రవీణ్ రెడ్డి హైకోర్టుకు వెళ్లారు. హైడ్రా కూల్చకుండా స్టే ఇవ్వాలని న్యాయస్థానంలో ప్రవీణ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం, హైడ్రా కమిషన్, రంగారెడ్డి కలెక్టర్, శంకర్ పల్లి రెవిన్యూ అధికారి, చీఫ్ ఇంజనీర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులను ప్రతి వాదులుగా పిటిషనర్ చేర్చారు. కాగా.. నగరంలో హైడ్రా ఆపరేషన్ కొనసాగుతోంది. గత ఆదివారం(ఆగస్టు 18) రంగారెడ్డి జిల్లా గండిపేట్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన భారీ భవనాలు, చెరువులో నిర్మించిన అపార్ట్‌మెంట్లను నేలమట్టం చేశారు. హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదులు రావడంతో హైడ్రా బృందం రంగంలోకి దిగింది. పటిష్ట బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులను అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే నగరంలోని గండిపేట చెరువు చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఫోకస్ చేసింది. ఐదు రోజుల్లో ఆపరేషన్ గండిపేట పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గండిపేట చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేస్తున్నారు. మరోవైపు చిలుకూరు, నార్సింగ్ మండలం ఖానాపూర్‌లలో భారీ భవనాలను కూడా కూల్చివేయనున్నారు.



**గుండెల్లో గుబులు...** మరోవైపు జంట జలాశయాల పరిరక్షణ లక్ష్యంగా హైడ్రా చేపట్టిన ఆపరేషన్‌తో ప్రముఖుల గుండెల్లో గుబులు మొదలైనట్లు తెలుస్తోంది. ముచ్చటపడి కట్టుకున్న ఫామ్‌హౌస్‌లు, పచ్చటి ప్రకృతి అందాల మధ్య నిర్మించుకున్న భవనాలు ఎక్కడ నేలమట్టమవుతాయో అన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. దీంతో.. హైడ్రా పంజా తమ నిర్మాణాల దాకా రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మంత్రులు, ఉన్నతాధికారుల ద్వారా మంత్రాంగం మొదలెట్టినట్లు తెలుస్తోంది. అయితే.. హైడ్రా వర్గాలు మాత్రం.. 'ఒత్తిళ్లకు తలొగ్గం.. ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను కూల్చకుండా వదలం' అని తేల్చిచెబుతున్నా యి. వరుస కూల్చివేతల నేపథ్యంలో రెండు రోజులు బ్రేక్ ఇచ్చామని.. త్వరలో మళ్లీ ఆపరేషన్ డిమాలిషన్ మొదలవుతుందని ఓ అధికారి చెప్పారు. మరోవైపు, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో సమావేశమయ్యారు. గండిపేటలో కూల్చిన భవనాలు, ప్రహరీ గోడ ల వివరాలను రంగనాథ్ ప్రభుత్వానికి సమర్పించారని తెలిసింది. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో గుర్తించిన నిర్మాణాల సమాచారమూ అందించినట్టు తెలుస్తోంది.

# ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా టీ సేఫ్ యాప్



హైదరాబాద్, ఆగస్టు 21: మహిళల్లో ఉన్న అభద్రత భావాన్ని పోగొట్టేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... మహిళలకు రక్షణ, సామాజిక భద్రత కల్పించేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శిక్ష, శిక్షణ ఏకకాలంలో అమలైతేనే క్రైమ్ రేట్ తగ్గుతుందన్నారు. మహిళల మీద దాడులు జరిగితే సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మాయిలను, మహిళలను గౌరవించేలా ప్రజల్లో అవగాహన పెంచుతామన్నారు. మహిళలపై హింస పెరగడానికి డ్రగ్స్, గంజాయి కూడా కారణమవుతున్నాయన్నారు. వాటి కట్టడి కోసం ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. మత్తు బానిసలపై నిఘా పెంచుతామన్నారు. ఆస్పత్రుల్లో పని చేసే డాక్టర్లు కూడా అభద్రతాభావంలో ఉండటం బాధాకరమన్నారు. మహిళా డాక్టర్లకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మంత్రులు, ఉన్నతాధికారులతో త్వరలో కోర్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని శాఖల్లో త్వరలో ఉమెన్ సేఫ్టీ కమిటీలు వేస్తామన్నారు. మహిళా భద్రత కోసం ప్రతి శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. "అమ్మాయిలు మహిళల భద్రత మీ బాధ్యత అని అన్ని విద్యాసంస్థలకు తెలియ చెబుతాం" అని అన్నారు. అమ్మాయిలను, మహిళలను గౌరవించేలా పాఠశాలల్లో పాఠాలు బోధిస్తామన్నారు. పబ్లిక్ ప్లేసుల్లో ఆసుపత్రిలో సీసీ కెమెరాలను పెంచేలా చర్యలు చేపడతామన్నారు. మహిళా భద్రత కోసం తమ ప్రభుత్వం ప్రారంభించిన టీ సేఫ్ యాప్ బాగా పనిచేస్తుందన్నారు. టీసేఫ్ యాప్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందన్నారు. ఈ యాప్‌ను ప్రారంభించేందుకు ఏడు రాష్ట్రాలు ముందుకొచ్చాయన్నారు. టీసేఫ్ యాప్‌కు మరింత ప్రచారం కల్పిస్తామన్నారు. ఆటోలు, క్యాబుల్లో టీ సేఫ్ నెంబర్లను ప్రచారం చేస్తామన్నారు. మహిళా భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను త్వరలో సీఎంకు సమర్పిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు.

# తెలంగాణలో ఆ దేశాలకి మించిన పర్యాటక ప్రాంతాలున్నాయి..

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్.. జిల్లా కేంద్రంలోని అతి పురాతనమైన పిల్లలమర్రి పర్యటక కేంద్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యన్నం శ్రీనివాస్ రెడ్డి, జి మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. పాశ్చాత్య దేశాల మాదిరిగానే రాష్ట్రంలో టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. టూరిజం అభివృద్ధికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో టూరిజంతో పాటు అన్ని రంగాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని జూపల్లి తెలిపారు. తూర్పు, మధ్య ఆసియా దేశాలకి మించిన పర్యాటక ప్రాంతాలు మన దేశంలో, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయని వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలు అన్నిటిపై విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని టూరిజం కేంద్రాలలో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. టూరిజంకు మార్కెట్ కల్పించనున్నామన్నారు. యాంత్రిక జీవనంలో టూరిజం వల్ల వినోదం కలుగుతుందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా టూరిజం అభివృద్ధికి తక్షణమే 5 కోట్ల రూపాయలను ప్రకటిస్తున్నామని జూపల్లి తెలిపారు. ఆసియా ఖండంలోనే అత్యంత పేరు ప్రఖ్యాతలుగాంచిన పిల్లల మర్రి చెట్టును పర్యటకులకు ఈ రోజు నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో టూరిజం సర్క్యూట్ ను ఏర్పాటు చేయనున్నామని జూపల్లి తెలిపారు. ముఖ్యంగా నల్లమల అభయారణ్యం, మల్లెల తీర్థం, సోమశిల, సరళసాగర్, కోయిల్ సాగర్‌తో పాటు, ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. అన్ని పర్యాటక ప్రాంతాలనూ కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నామని జూపల్లి తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 150 కిలో మీటర్ల నిడివి గల కృష్ణానది ఉందని పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com